
94.13 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం సర్వర్ మొరాయించినా సజావుగానే సాగింది. జిల్లాలో 94.13శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఉదయం 7గంటలకు సంగం మండలం గాంధీజన సంఘం, వెంకటేశ్వరపురం, సంగం, ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆమె పెనన్లు పంపిణీ చేశారు. శనివారం సాయంత్ర ఏడుగంటల వరకు 3,08,266 పింఛన్లుకుగానూ 2,90,163 పింఛన్లను పంపిణీ చేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

మురిపించి.. మెప్పించి

- వేతన జీవులు, వృద్ధులకు ఊరటనిచ్చిన కేంద్ర బడ్జెట్
- రుణ పరిమితి పెంపుతో రైతులకు ఊరట
- జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం

నెల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేతన జీవులు, రైతులను కరుణిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసింది. శనివారం పార్లమెంటులో కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రెండు వర్గాలకు భారీ ఊరట లభించింది. ఒక వర్గానికేమో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచగా, మరో వర్గానికేమో రుణ పరిమితిని పెంచుతూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులకు నిధులు దక్కగా, జిల్లా కూడా లబ్ధి పొందనుంది. ఇప్పటివరకూ సంపాదన రూ.7 లక్షలలోపు ఉంటే ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఆ పరిమితిని తాజా బడ్జెట్‌లో రూ.12 లక్షలకు పెంచారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, మరో 20 వేల మంది ప్రైవేటు ఉద్యోగ, వ్యాపారులకు లాభం చేకూరనుంది. అలానే కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు ఇప్పటివరకూ రూ.3 లక్షల వరకు రుణాలను అందించేవారు. ఇకపై ఆ పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. ఈ కార్డులు కలిగిన జిల్లాలో సుమారు 30 వేల మంది రైతులకు లబ్ధి జరగనుంది. పీఎం కిసాన్ పథకాన్ని కొనసాగించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. తద్వారా జిల్లాలో 1.66 లక్షల మందికి ఏటా పెట్టుబడి సాయం అందనుంది.

● కేన్సర్ రోగులకు ఊరట

ప్రతి జిల్లాలోనూ కేన్సర్ స్ర్కీనింగ్ సెంటర్ ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఆ లెక్కన జిల్లాలో కూడా ప్రభుత్వ కేన్సర్ స్ర్కీనింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. మూడేళ్లలో దీనిని నిర్మించనున్నారు. దీని ద్వారా అనేక మంది కేన్సర్ బాధితులకు భరోసా లభిస్తుంది. కేన్సర్ స్ర్కీనింగ్‌కే ఇప్పుడు రూ.వేలు ఖర్చవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే సెంటర్‌తో ఆ భారం పేదలపై తగ్గనుంది.

● ఇక రాష్ట్రంలో రోడ్లు, వంతెనల అభివృద్ధికి రూ.239 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఆ కేటాయింపుల్లో జిల్లాకు కూడా భారీగానే నిధులు దక్కే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతు న్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే నేచురల్ ఫార్మింగ్‌పై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. తాజా బడ్జెట్‌లో కూడా నేచురల్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించేందుకు నిధులు కేటాయించారు. అందులో రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించగా, ఆ వంతు జిల్లాకు కూడా నిధులు దక్కనున్నాయి. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, సాగరమాల ప్రాజెక్టుకు కూడా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అయితే, అందులో జిల్లాలో జరుగుతున్న పనులకు ఎంత మేర నిధులు దక్కుతాయన్నది ప్రత్యేకంగా చెప్పలేదు. దీనిని ఆయా శాఖలు ప్రకటించాల్సి ఉంది.

● ఎంఎస్ఎంఈలకు భారీ ఊతం

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు కేంద్రం చేయూతనిచ్చింది. ఈ పరిశ్రమలకు రుణ పరిమితి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు. దీని మూలంగా జిల్లాలోని సుమారు 14 వేల ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు లబ్ధి చేకూరడమే కాకుండా కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మంచి అవకాశాలు ఏర్పడినట్టు అయింది.



బడ్జెట్‌పై మిశ్రమ స్పందన - 10వ పేజీలో..



సంక్షేమానికి పెద్దపీట

పేద, మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఏపీకి ప్రాధాన్యత ఇవ్వటం సంతోషకరం. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా ఈ బడ్జెట్ ఉంది. వ్యక్తిగత ఆదాయపు పన్నును రూ.12 లక్షలకు పెంచటం చాలా పెద్ద నిర్ణయం. మధ్యతరగతి వర్గానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎంఎస్ఎంఈలు, చిన్నపరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ కేటాయింపును రూ.5కోట్ల నుంచి 10కోట్లకు పెంచటం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపన జరిగడానికి అవకాశం ఏర్పడింది.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.75 లక్షల కోట్లు కేటాయించడం శుభపరిణామం. గ్రామీణ అభివృద్ధికి రూ.2.68 లక్షల కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.98 వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. గత ఐదేళ్లలో ఆర్థికంగా చితికిపోయిన ఏపీని అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్రం సిద్ధంగా ఉండటం ఆనందదాయకం.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ప్రజారంజక బడ్జెట్



దేశ ప్రగతిని మార్చే అద్భుతమైన ప్రజారంజకమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. రైతులను ప్రోత్సహించే దిశగా నిర్ణయాలు తీసుకొని అడుగులు వేసింది. పేదలు, యువత, రైతులు, మహిళల పురోభివృద్దే లక్ష్యంగా కేంద్రం బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచింది.

- అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు

రైతులకు వ్యతిరేక బడ్జెట్



కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. బడ్జెట్ కేటాయింపులలో వారి న్యాయమైన కోర్కెలు తీర్చటంలో కేంద్రం విఫలమైంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చేలా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏదో మొక్కుబడిగా బడ్జెట్ ప్రవేశపెట్టి మేమేదో గొప్ప బడ్జెట్ ప్రవేశ పెట్టామని గణాంకాలు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం బడ్జెట్ అమలు కావటం లేదు. కొవిడ్ తర్వాత వ్యవసాయ రంగంలో అనేక మార్పులు వచ్చాయని చెబుతున్నా అవి ఎక్కడ అమలు చేశారో అర్థం కావటం లేదు. గతంలో రైతుల ఆందోళనలపరంగా ఆయా ఉద్యమకారులతో కుదుర్చుకున్న ఒప్పందాలు నేటికి పూర్తిస్థాయిలో అమలు కాలేదు.

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

ఇది పూర్తిగా వ్యతిరేక బడ్జెట్



ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్. ఉన్నత వర్గాలకు, పారిశ్రామిక వేత్తలకే ప్రాధాన్యం ఇచ్చారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో అధిక భాగం ఆ రాష్ట్రానికి కేటాయింపులు జరిగాయి. నిరు ద్యోగ సమస్య, నిత్యావసర వస్తువుల తగ్గింపు గురించి ఎక్కడా ప్రస్తావించ లేదు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక బడ్జెట్టే.

- మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

రైతులు ఆశించిన బడ్జెట్ కాదు



సగటు రైతుకు లాభించే అంశాలేవీ ఈ బడ్జెట్‌లో లేవు. రూ.3లక్షల నుంచి 5లక్షల వరకు వడ్డీ రాయితీ రుణాల పెంపు ఎంతమంది రైతులకు వర్తిస్తుంది. 100 జిల్లాల్లో ధన ధాన్య కృషి యోజన పథకం ప్రయోగాత్మకంగా అమలు చేస్తామన్నారు.. కానీ విధి విధానాలపై స్పష్టత లేదు. రెండు యూరియా తయారీ ఫ్యాక్టరీలు ప్రారంభిస్తామన్నారు. వాటివల్ల రైతులకు ఎంతవరకు ప్రయోజనం ఉంటుంది.

- చిరసాని కోటిరెడ్డి, రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

విద్యకు తగినన్ని కేటాయింపులు లేవు



ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి చెందాలంటే జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పింది. కానీ బడ్జెట్‌లో ఆ పరిస్థితి లేదు. జాతీయ విద్యా విధానం విజయవంతంగా అమలు కావాలంటే విద్యకు జీడీపీలో 6 శాతం, బడ్జెట్‌లో 6 శాతం కేటాయించాలి. అలాగే వేతనజీవులకు ఇన్‌కం టాక్స్ డిడక్షన్ పెంపుదల కూడా అంకెల గారడిలా ఉంది తప్ప ఎలాంటి ఉపయోగం లేదు.

- జీవీ.చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అన్నివర్గాల డ్రీమ్ బడ్జెట్



ఏపీకి ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాలకు సమన్యాయం చేసే డ్రీమ్ బడ్జెట్‌ను అందించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు, విశాఖ స్టీల్‌కు రూ.3,295 కోట్లు, విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు, ఏపీ ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్లు ఇలా రూ.వేల కోట్లు రాష్ట్రానికి కేటాయించడం ఆనందంగా ఉంది.

- ఎస్ వంశీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమ పాటల హోరు.. శ్రేణుల్లో హుషారు!

- అట్టహాసంగా ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు
- తరలివచ్చిన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు
- పతాక యాత్రల జెండాలను అందుకున్న నేతలు
- అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళులు
- తొలిరోజున 22 అంశాలకు తీర్మానం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీతారాం ఏచూరి ప్రాంగణంలో (అనిల్‌గార్డన్) మూడు రోజులపాటు ఈ సభలు జరగనున్నాయి. తొలుత సభా ప్రాంగణంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్ బ్యూరో సభ్యులు ఏంఏ బేబి, వెంకట్, పి.మధు, శ్రీనివాస్, ఎంఏ గఫూర్ పాల్గొని పతాక యాత్రల జెండాలను స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం నేతలు నివాళులు అర్పించారు. సభ ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి సభ్యులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి.



సీపీఎం జెండాను ఎగరేసి సెల్యూట్ చేస్తున్న వామపక్ష నేతలు మధు, ఎంఏ బేబి, బీవీ రాఘవులు, గఫూర్, వి.శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు



సభా వేదికపై సీపీఎం అగ్రనేతలు ఎంఏ బేబి, బీవీ.రాఘవులు ముచ్చట్లు

● ప్రభుత్వాలపై ఆగ్రహం

ఈ సభల్లో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఏంఏ బేబి, బీవీ రాఘవులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలకు అనుకూలంగా ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ వంటి సంస్థలతోపాటు కొన్ని మీడియా సంస్థలు కూడా అనుకూలంగా ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు. వాటి ద్వారా కేంద్రం రాష్ట్రాలపై పెత్తనం చేస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాల నిర్వహణ ఆయా రాష్ట్రాలే నిర్వహిస్తుండగా, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకుని వీసీల నియామకం గవర్నర్లు చేపట్టేలా ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రం చేతుల్లోకి విశ్వవిద్యాలయాలు వెళితే వాటిపై పెత్తనం రాష్ట్రానికి ఉండదన్నారు. దీనిపై తెలుగుదేశం, జనసేన వైఖరి ఏంటో స్పష్టం చేయా లని డిమాండ్ చేశారు. వనరుల పంపిణీలో కేంద్ర వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. నేపాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వమే ఎన్నో సంస్కరణలు చేస్తోందని, అలాగే క్యూబా దేశంలో విద్యతోపాటు అన్ని రకాల వైద్య చికిత్సలు ఉచితంగా అందుతున్నాయని చెప్పారు. అదే తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. మరో రెండు నెలల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని 3వేల గ్రామాలలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని నేతలు వెల్లడించారు.



గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి సభ్యులు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ 11 ఏళ్ల పాలనలో దేశంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. పారిశ్రామికవేత్తలు అంబానీ, అదానీలకు కొమ్ము కాసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. అలవికాని వాగ్దానాల వల్ల సీఎం చంద్రబాబు నిధుల కోసం వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల రూ.1.75 లక్షల కోట్ల భారం ప్రజలపై పడుతుందని, ఈ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ విధ్వంసం, ఘర్షణ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వివిధ రూపాలలో రాష్ట్రానికి కేంద్రం రూ.20వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఆ డబ్బు రాష్ట్రానికి వచ్చేలా సీఎం చంద్రబాబు ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. ఖాళీ స్థలాల్లో నిర్మితమైన ఇళ్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ బీజేపీ పొత్తులో ఉన్న పార్టీలు పునరాలోచించి తమ రాష్ట్ర భవిష్యత్తుపై దృష్టి సారించాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వైసీపీ లాగా కాకుండా ఈ నిర్మాణం పూర్తి చేసి చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు ఐక్యంగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు 22 అంశాలతో సభలో ప్రతిపాదనలు చేయగా వాటిని పార్టీ నేతలు ఏకపక్షంగా తీర్మానించారు. కాగా, మహాసభ నిర్వహణకుగాను ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష రూపాయల విరాళాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నేతలు మూలం రమేష్, దామా అంకయ్య, మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, మంగలం పుల్లయ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద..



గ్రామసభలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న అధికారులు

ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వం

- అధికారులకు తేల్చి చెప్పిన అన్నదాతలు

కావలి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం రెండు పంటలు పండే మా భూములు లాక్కుని మా పొట్ట కొట్టవద్దు.. ప్రాణాలైనా ఇస్తాం.. భూములు మాత్రం ఇవ్వం" అంటూ కావలి మండలం చెన్నాయపాలెం రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం భూసేకరణపై జరిగిన గ్రామసభలో ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తహసీల్దార్లు శ్రావణ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండు పంటలు పండే భూములు మీకిచ్చి మేము ఎటుపోవాలని నిలదీశారు. మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనే రైతు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ ఎకరా భూమి విలువ రూ. 35 లక్షలు ఉందని రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచకపోవటంతో నష్టపోతామన్నారు. భూమి విలువ పెరిగినా రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచక పోవటం అధికరారుల తప్పిదమేనని అన్నారు. నాగన్నగారి శ్రీను మాట్లాడుతూ అమరావతి రైతులకు పరిహారం అందించినట్లు ఇక్కడ రైతులను కూడా పెట్టబోయే పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో భాగస్వాములుగా చేయాలని డిమాండ్ చేశారు. పొన్నాతి చలపతిరావు మాట్లాడుతూ పెదపట్టపుపాలెం, చెన్నాయపాలెం, ఆనెమడుగు పంచాయతీల నుంచి సుమారు 12వేల మంది రైతులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

- 8 రోజుల ప్రయాణానికి టికెట్ ధర రూ.9వేలు
- అయోధ్య, వారణాసిలలోనూ దైవదర్శనాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రతిష్టాత్మకంగా జరుగు తున్న కుంభమేళాకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు-1 డిపో మేనేజరు మురళీకృష్ణ తెలిపారు. శనివారం నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఈ నెల 8వ తేదీ మధ్యా హ్నం 2 గంటలకు కుంభమేళాకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని చెప్పారు. హైదరాబాద్, నాగపూర్ మీదుగా 9వ తేదీ సాయంత్రానికి కుంభమేళాకు బస్సు చేరుకుంటుందన్నారు. తిరిగి 10వ తేది ప్రయాగ్‌రాజ్‌లో బయలుదేరి 11వ తేది రాత్రి అయోధ్యకు చేరుకుంటుం దన్నారు. 12వ తేదీ ఉదయం అయోధ్యలో బాలరాముడి దర్శించుకుని రాత్రి వార ణాసికి బయలు దేరుతుందన్నారు. 13వ తేదీన వారణాసిలో బస, 14వ తేది ఉదయం బస్సు బయలుదేరి 15వ తేదీ రాత్రి నెల్లూరుకు చేరుకుంటుందన్నారు. ఈ 8 రోజుల ప్రయాణానికి ఒకరికి రూ.9 వేలు టికెట్ ధర నిర్ణయించినట్లు చెప్పారు. టీ, టిఫిన్, భోజనం, వసతి ఇతర ఖర్చులు ఎవరికివారుగా పెట్టుకోవాలన్నారు. కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుకు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని చెప్పారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేయండి : ఈఎన్‌సీ



సమీక్షలో మాట్లాడుతున్న ఈఎన్‌సీ మరియన్న

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వకుండా తగిన ప్రణాళికలు తయారు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ మరియన్న తెలిపారు. శనివారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన కార్పొరేషన్ల ఇం జనీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓవర్‌హెడ్ ట్యాంకులు, డైరెక్ట్ పంపింగ్ స్కీంలు, స్టోరేజ్ ట్యాంకులను ఇప్పుడే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. రోడ్లపై గుంతలు లేకుండా ప్యాచ్ వర్కులు పూర్తి చేసి సాఫీ ప్రయాణానికి వీలు కల్పించాలన్నారు. అమృత్ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల ప్రయోజనార్థం అవసరమైన చోట్ల సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేసి, అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు, ఈఈ, డీఈఈలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, APEWIDC డిపార్టుమెంటు, నెల్లూరు

షార్ట్ టెండరు నోటీసు NIT నెం. HD/ 5 నుండి 36/2024-25, తేది:01.02.2025

APEWIDC నెల్లూరు డివిజన్ పరిధిలో 32 బిసి Hostels భవన మరమ్మత్తులకు గాను అంచనా విలువ 78.00 లక్షలతో టెండర్లు కోరబడుతున్నవి. టెండరు డాక్యూమెంట్లు 06.02.2025, నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరములు www.apeprocurement.gov.in లో లభ్యమగును.

ఫోన్ నెం. 94409 62617.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, APEWIDC DIVISION,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

న్యూస్ బాక్స్



పెంచలస్వామికి ప్రత్యేక పూజలు

రాపూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూల విరాట్‌కు అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణం తిలకించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవ నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పీజీ, ఎల్‌ఎల్‌బీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

వెంకటాచలం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో శనివారం జరిగిన పీజీ మొదటి, ఎల్‌ఎల్‌బీ మూడవ సెమిస్టర్ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలలో నెల్లూరులోని జగన్స్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

- డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలో..

శనివారం జరిగిన డిగ్రీ మొదటి, 4వ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మధుమతి మరో ప్రకటనలో తెలిపారు.

కానిస్టేబుల్ విధుల్లో ట్రైనీ డీఎస్పీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కేటాయించిన ట్రైనీ డీఎస్పీ శివప్రియ శనివారం శిక్షణ నిమిత్తం నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్‌కు వచ్చారు. తొలి రోజు జగన్నాథ రథయాత్రలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. వారం పాటు నవాబుపేట స్టేషన్‌లో విధులు నిర్వహించనున్నారు. 2024 బ్యాచ్‌కి చెందిన ఆమెను శిక్షణ నిమిత్తం జిల్లాకు కేటాయించారు.

నెల్లూరులో గణపతి సచ్చిదానంద స్వామి

నెల్లూరు (సాంస్కృతికం) : మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామి నగరంలోని దత్తనాథక్షేత్రం, సుజాతమ్మకాలనీ అష్టలక్ష్మి ఆలయానికి శనివారం రాత్రి విచ్చేశారు. ఈనెల 4 వరకు వీరు ఆలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామీజీలకు కృష్ణ జ్ఞాన బోధ సేవా ట్రస్టీలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, పచ్చిపాల ప్రమీలమ్మ, అనపల్లి మస్తాన్‌రెడ్డి, అనపల్లి అశోక్ రెడ్డి, డి.ఫణిరత్నం, డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న, రేబాల పట్టాభిరామిరెడ్డి, సీసీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలు ప్రమాదకరం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నేడు దేశంలో మత రాజకీయాలు నడుస్తున్నాయని, అవి ప్రమాదకరమని ప్రజాశక్తి సంపాదకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్.శర్మ అన్నారు. సింహపురి పుస్తక మహోత్సవంలో శనివారం రాత్రి ఆరుద్ర సాహిత్య వేదికపై 'ఏది సనాతన ధర్మం?' 'సనాతన ధర్మం అంటే ఏమిటి' అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. సాహితీవేత్త, విమర్శకులు తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్.శర్మ వీటిని ఆవిష్కరించారు. సాహిత్య పరిశోధకులు డాక్టర్ కాళిదాసు పురుషోత్తం వీటిపై సమీక్ష చేశారు. కార్యక్రమానికి విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కన్వీనర్ కే లక్ష్మయ్య అధ్యక్షత వహించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7977
వెండి కిలో ధర	రూ. 96,300
వెండి ఒక గ్రాము	రూ.99.30

త్వరలో సూపర్ సిక్స్ పథకాల అమలు

- భవన నిర్మాణాల్లో నిబంధనల సడలింపు
- మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ వెల్లడి



వృద్ధురాలికి పింఛన్ అందచేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా త్వరలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాతలకు రైతు భరోసా పథకాలను అమల్లోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నెల్లూరులోని ఆరవ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అంద చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవన నిర్మాణాలను సరళతరం చేశామని, ఇందుకోసం 18 రకాల నిబంధనలను సడలించామని పేర్కొన్నారు. బిల్డర్లతో సమావేశం నిర్వహించి 40 అడుగుల రోడ్లను 30 అడుగులకు కుదించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి,నగర కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 66.870 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో శనివారం నాటికి 66.870 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలి పారు. ఎగువ ప్రాంతాల నుంచి 1,831 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా దిగువ డెల్టాకు 2,150, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350, కండలే రుకు 200 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

పేదోళ్లకు గృహయోగం!

- పీఎంఏవై 2.0 అమలుకు కేంద్ర కసరత్తు
- మూడు రూపాల్లో పథకం విస్తరణ
- అన్ని వర్గాలకూ రాయితీ వర్తించేలా ప్రణాళిక



సంగంలోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

సంగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. సమాజంలోని అన్ని వర్గాల వారు సొంత ఇంటిలో నివాసం ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసింది. గతంలో ఎన్ని పథకాలు ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదని తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం భారీ మార్పులతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కు శ్రీకారం చుట్టింది. పేదలకు మరింత చేయూత అందిస్తూ ఇళ్ల నిర్మాణానికి రెట్టింపు సాయం అందించేలా పథకంలో భారీ మార్పులు చేసింది. 2024 చివరిలో పీఎంఏవై 2.0కు శ్రీకారం చుట్టగా మెజారిటీ పేదలకు గృహ యోగం లభించనున్నది. కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) శ్రీకారం చుట్టింది. సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేయూత అందించింది. ఈ పథకంలో భాగంగా పీఎంఏవై (అర్బన్) కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు టిడ్కో ఇళ్లు అందజేసింది. పీఎంఏవై (గ్రామీణ) కింద గ్రామీణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి చేయూత ఇచ్చింది.

మూడు రకాలుగా అమలు..

- బీపీఎల్ : దారిద్ర్య రేఖకు దిగువన ఉండి ఆర్థికంగా అట్టడుగు వర్గాలు
- ఈడబ్ల్యుఎస్: ఆర్థికంగా బలహీనమైన విభాగం
- ఎల్‌ఐజీ: తక్కువ ఆదాయ సమూహం. ఎంఐజీ: మధ్య ఆదాయ సమూహం

అమలు ఇలా..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఒక విభాగంగా గుర్తించి వారికి సొంత ఇల్లు అందుబాటులోకి తేవడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్ర నుంచి ఆర్థిక సహాయం అందజేస్తుంది. లేనివారికి స్థలం అందచేసి అందులో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే సమకూరుస్తుంది. పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు (12 అంకణాలు), గ్రామాల్లో 3 సెంట్ల (18 అంకణాలు) చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ (బీఎల్‌సీ) కింద వీరికి ఇప్పటివరకూ అందిస్తున్న రూ. 1.50 లక్షల సాయాన్ని రూ.2.50 లక్షలకు పెంచాలని కేంద్రం భావిస్తుంది. ఈ మొత్తంలో కేంద్రం వాటాలో ఎలాంటి మార్పు లేదు. గతంలో మాదిరిగా కేంద్రం రూ. 1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా అదనంగా ఇచ్చే రూ. లక్ష రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా ఉంటుందని సమాచారం. దీంతో పాటు స్వచ్ఛభారత్ స్కీమ్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.27 వేలు అందించనున్నారు మురికివాడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ స్కీమ్ కింద సహాయం అందుతుంది.

వడ్డీ రాయితీ

ఎంతో కొంత స్తోమత ఉండి ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందే వారిని ఉద్దేశించి ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తెచ్చింది. గరిష్ఠంగా రూ. 25 లక్షల రుణం లేదా రూ.35 లక్షలు ఇంటి విలువ ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకూ ఉన్న ఈడబ్ల్యుఎస్ కుటుంబాలు, రూ.3- 6 లక్షల ఆదాయం ఉన్న ఎల్‌ఐజీ (లోన్ ఇన్‌కం గ్రూపు) కుటుంబాలు, రూ.6-9 లక్షల ఆదాయం ఉన్న ఎంఐజీ (మిడిల్ ఇన్‌కం గ్రూపు) కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ ఇస్తుంది. వీరికి వడ్డీ రాయితీ ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.1.80 లక్షలు అందచేయనున్నారు.

ఆఫర్డబుల్ హౌసింగ్ పార్ట్‌నర్‌షిప్ (ఏహెచ్‌పీ)

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతుల్లో ఇళ్లను నిర్మిస్తారు. వీటిని ప్రధానంగా ఆర్థికంగా బలహీన సమూహాలకు (ఈడబ్ల్యుఎస్) అం దిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మాదిరిగానే కొంత మొత్తం చెల్లించి ఈ అపార్టుమెంట్లలో ప్లాట్లను అందచేస్తారు. సరసమైన ధరల్లో అందించేందుకు వీలుగా రిడీమబుల్ (వినియోగించుకో తగిన) హౌ సింగ్ ఓచర్లను అందుబాటులో ఉంచుతారు.

ఉమ్మడి అభ్యర్థికే 'డిప్యూటీ'

- కార్పొరేటర్లతో చర్చించి నిర్ణయం : నారాయణ



కోటంరెడ్డి సోదరులతో భేటీ అయిన మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవిని ఉమ్మడి అభ్యర్థికే ఇవ్వనున్నట్లు మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారు. శనివారం ఆయన నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యేతోపాటు గిరిధర్‌రెడ్డితో కూడా సుదీర్ఘంగా చర్చించారు. కార్పొరేటర్లందరితో చర్చించాక తుది నిర్ణయం తీసుకుని సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి ఉమ్మడి అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా రూరల్లో ఎస్‌ఎంసీ అధికారులు అనుసరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి సహకరించండి

- వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు



పరిశ్రమల ప్రతినిధులతో సమీక్షిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆవిష్కరణాలు, నైపుణ్యాభివృద్ధికి పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య సహకారం అవసరమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండల పరిధిలోని వీఎస్‌యూలో శనివారం పరిశ్రమల ప్రతినిధులతో కలిసి ఇండస్ట్రీ - ఇన్‌స్టిట్యూట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఎంఆర్, దొడ్ల డెయిరీ, అదానీ విల్మర్, ఎమామీ, పెన్‌వర్, హైటెక్ పార్మా, ఆల్కా బయాలాజికల్స్, సెయిల్ ఎనర్జీ, జెమిని ఆయిల్స్ వంటి ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ పరిశ్రమలు తక్షణ మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనిచేస్తాయని, విద్యా సంస్థలు దీర్ఘకాలిక ప్రయోజనాలపై ఆధారపడి మూలాధార పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తాయన్నారు. పరిశ్రమలు కూడా విద్యా సంస్థల నైపుణ్యాన్ని ఉపయోగించుకుని కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయవచ్చన్నారు. విద్యా సంస్థలు తమ పరిశోధన ఫలితాలను వాస్తవ జీవితంలో అమలు చేసే అవకాశం పొందుతాయన్నారు. ఇలాంటి భాగస్వామ్యాలు సమాజానికి ప్రభావం చూపే క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హనుమారెడ్డి, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ వీరారెడ్డి, డాక్టర్ కోట నీల మణికంఠ, డాక్టర్ వీ చెంచురెడ్డి, ఎన్‌ఆర్‌వీ రమణరెడ్డి, జీ విజయానందకుమార్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఐటీఐల్లో 60శాతం మార్కులతో పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండో సంవత్సరంలోకి ప్రవేశించేందుకు వెంకటేశ్వరపురం బాలుర ఐటీఐలో బ్రిడ్జి కోర్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న యువకుడిని పరిశీలిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్

మనుబోలు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మం డలంలోని కొలనుకుదురులో కొల్లపూడి ప్రతాప్ (35) శుక్రవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొలనుకుదురుకు చెందిన భానుకు గూడూరుకు చెందిన ప్రతాప్‌తో 7ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సం తానం. వీరు కొంతకాలంగా కొలనుకుదురులోని ఎస్టీ కాలనీ సమీపంలో నివసిస్తున్నారు. ప్రతాప్ గూడూరు రైల్వేస్టేషన్లో సమోసాలు, టీ, విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. కొద్ది రోజులుగా భార్యపై అనుమానంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శుక్ర వారం రాత్రి భార్యాభర్తలు ఘర్షణపడి కొట్టుకున్నా రు. మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్య కు ప్రయత్నించగా భర్త తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. అనం తరం భర్త ఇంట్లో రేకుల కింద కొయ్యకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మా రకస్థితి నుంచి స్పృహలోకి వచ్చిన భార్య భర్త ఉరివేసుకుని మృతి చెందడం చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి గాయపడిన భానును చికిత్స నిమిత్తం గూడూ రు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమా చారం అందుకున్న సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుప త్రికి తరలించారు. మృతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆ హెచ్‌ఎం ఏమయ్యాడు..?

- మూడు నెలలుగా విధులకు గైర్హాజరు
- ఇస్కపల్లి పంచాయతీ బీఎంఆర్ గిరిజన కాలనీ ప్రజలు ఆందోళన



ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఖాళీ కుర్చీ ముందు విద్యార్థులు

అల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇస్కపల్లి పంచాయతీ బీఎంఆర్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వై.శ్రీనివాసులు మూడు నెలలుగా విధులకు హాజరు కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేప ట్టారు. ఈ విషయంపై పూర్తి వివరాలను ఆరా తీయగా ఇలా ఉన్నా యి. పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులుండగా వారిలో ఒకరు హెచ్‌ఎం శ్రీనివాసులు. ఈయన నవంబరు 4వ తేదీ నుంచి విధు లకు రావ డం లేదు. గతంలో నాడు-నేడు పనుల కింద నిధులు విడుదలైతే అరకొరగా పనులు చేపట్టి మిగిలిన పనిని అలాగే వదిలేసి వెళ్లాడు. ఉన్న ఒక ఉపాధ్యాయుడే పూర్తిస్థాయిలో విద్యా బ్యాసం చేయలేకపోతున్నాడు. ఈ విషయంపై ఎంఈవో రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా సదరు ఉపాధ్యాయుడు అసలు ఎక్కడున్నాడో తెలియడం లేదన్నారు. ఇప్పటివరకు తనకు, ఉన్నతాధికారికి సెలవు కావాలని కోరలేదన్నారు. అతను ఉన్న ఇంటి వద్ద విచారించగా ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. అతని ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉందన్నారు. ఈ సమాచారాన్ని డీఈవోకు తెలియజేశాం. ఏది ఏమైనా గిరిజన ప్రాంతం కావడం తో ఇక్కడ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జైజై జగన్నాథ!





జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తులు, జగన్నాథ, బలరామ ఉత్సవర్లు

- నగరంలో కనుల పండువగా రథయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో 12వ గౌర నితాయ్ (జగన్నాథ, బలరామ) రథయాత్ర శనివారం శోభాయమానంగా జరిగింది. నగర వీధులన్నీ రంగవల్లులుతో కళకళలాడాయి. ఈ యాత్రలో కళాకారుల కోలాటాలు, భజనలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాల భజనలతో నగరం మారుమోగింది. మూలాపేటలో ఆంజనేయస్వామి విగ్రహం సెంటర్‌లో జరిగిన ప్రారంభోత్సవ సభలో ఇస్కాన్ నెల్లూరు అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ స్వామి మాట్లాడారు. ఈ సభలో డాక్టర్ వైష్ణవన్‌గిరి (ముంబయి), శ్రీనివాస శ్యామ్‌దాస్ (హోసూరు), కీర్తి రాజ్‌దాస్ (చీరాల), కరుణ సింధుదాస్ (ఝాన్సీ) పాల్గొని ఇస్కాన్ సేవలను వివరించారు. ఈ సందర్భంగా సావనీర్ విడుదల చేసి, కాటన్ సంచులను ఆవిష్కరించారు. ఇస్కాన్ మందిరంలో ఉచిత ప్రసాదాల కోసం రూ.10లక్షలు, తిరుపతి జిల్లా గూడూరులో ఓ గృహాన్ని విరాళంగా నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేతలు పేరం శ్రీలక్ష్మి, మస్తాన్‌రావు దంపతులు అందజేశారు. మూలాపేట అలంకార్‌సెంటర్, పెద్దబజారు, చిన్నబజారు, సంతపేట, ఏసీబొమ్మ, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్ మీదుగా రథయాత్ర సర్వోదయ కళాశాలకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మందిర కమిటీ డీవీఎస్ సభ్యుడు గిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడండి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రహదారుల్లో ప్రాణాపాయానికి గురైన వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా కాపాడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. జాతీయ భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం నారాయణ వైద్య కళాశాలలో రవాణా శాఖ, నారాయణ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని కాపాడేందుకు సమాచారం ఇచ్చిన వారిపై ఎలాంటి పోలీసు కేసులు ఉండవన్నారు. ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం కూడా లేదని చెప్పారు. నారాయణ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, అసిస్టెంట్ ఎంవీఐ రఘునాథరెడ్డి తదితరులు మాటాడారు. అనంతరం రోడ్డు భద్రతపై పోస్టర్లను విడుదల చేశారు.

ఆయిల్ మిల్లుల మూసివేత

కావలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ (వంటనూనెలు) మిల్లులపై విజిలెన్స్ దాడులు చేస్తారనే ప్రచారంతో శుక్ర, శనివారం పట్టణంలోని ఆయిల్ మిల్లులను వాటి యజమానులు మూసివేశారు. లూజ్ ఆయిల్ విక్ర యాలు జరపరాదనే ప్రభుత్వ నిబం ధనలను అడ్డుపెట్టుకుని తరచూ విజి లెన్స్ అధికారులు దాడులు చేస్తుం టారు. అయితే లూజ్‌ఆయిల్‌ను ట్యాంకర్లతో నెల్లూరు నుంచి సరఫరా చేసే హోల్‌సేల్ డీలర్లే విజిలెన్స్ అధికారులను మేనేజ్ చేస్తుంటారు. ఒకవేళ వారు దాడులకు వస్తుంటే సమాచారంను కొందరు నెల్లూరు హోల్‌సేల్ డీలరేకే ముందుగా సమా చారం ఇస్తున్నారు. ఆ సమాచారాన్ని స్థానిక ఆయిల్ వ్యాపారులకు తెలియ చేస్తుండటంతో ముందుగా ఆయిల్ మిల్లులను మూసివేస్తున్నట్లు తెలిసింది.



ఎయిర్‌పోర్ట్ దగ్గర ప్లాట్లు

నెల్లూరు ఎయిర్‌పోర్ట్ దాని చుట్టూ వున్న ఇండస్ట్రీస్‌కు అతి దగ్గరలో 18.5 అంకాల ప్లాట్ 6.5 లక్షలు మాత్రమే. జిల్లాలో పొలములు, ప్లాట్లు కొనబడును, అమ్మబడును. ప్రైవేటు ఫైనాన్స్ సౌకర్యం కలదు. సం.ప్ర. సెల్: 98664 35396

AJR-205612

టైలరింగ్

మీకు టైలరింగ్ వచ్చా!! మీ ఇంటి వద్దే!! మిషన్ కల్గి వుంటే నెలకు 18-26 వేల వరకు సంపాదన. మా ఫ్యాక్టరీలో నైటీలు, నైట్ డ్రస్సులు కుట్టవలెను. హోల్‌సేల్‌గా అమ్ముకోవచ్చును. సం.ప్ర.94406 40514.

AJR-205562

ఇల్లు అమ్మబడును

సున్నపుబట్టి (దగదర్తి) నవభారతి స్కూల్, Opp: 32 1/2 అంII స్థలంలో 12 1/2 అంకణములు కట్టుబడి గల ఇల్లు అన్ని వసతులు గల ఇల్లు అమ్మబడును. సం.ప్ర. సెల్: 99664 37720

AJR-205711

మహా కుంభమేళా బస్సుయాత్ర

మహాశివరాత్రికి మహాకుంభ మేళాకు • ఒరిస్సా • బీహార్ • ఉత్తర ప్రదేశ్‌లో ఉన్న పుణ్యక్షేత్రాలు చూపుటకు బస్సుయాత్ర తే.19-05-25. 15 రో. 7 రాత్రులు. టి.ధర రూ.21,000/-, 3 రో. తే.06-02-25 టి.ధర రూ.4500/-. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 9866527640

AJR-2772

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

WANTED

స్టోన్‌హౌస్‌పేట ప్రముఖ బుక్ షాపు నందు పనిచేయుటకు అబ్బాయిలు కావలెను. సం.ప్ర. సెల్: 99494 03056

AJR-211813

కుంభమేళ Ac స్లీపర్ బస్సు

ప్రయాగరాజ్, కాశీ, అయోధ్య, పూరి, బిరిజా దేవి శక్తి పీఠం, చిత్రకూటం, వైద్యనాథ్, కోణార్క్, బుద్ధగయ, గయా తేది:15-02-2025. 12 రోజులు టిక్కెట్ 1కి 27,000/-. సం.ప్ర. కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504

AJR-205527

3 బస్సు యాత్రలు

1 బస్సు, కదిరి, లేపాక్షి, ఒంటిమిట్ట తేది:01-02-25. 1రో టి1కి 1500/-, 2వ బస్సు ముచ్చింతల, వరంగల్, కొండగట్టు, భద్రాచలం తేది:07-02-25. 4 రో టి1కి 7000/-, 3వ బస్సు హంపి, గోకర్ణ, శృంగేరి, మైసూర్ తేది:22-02-25. 6రో టి1కి 10,500/-. కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504

AJR-205510

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

హైవే మార్జిన్‌లోనే హైవోల్టేజి విద్యుత్ లైన్

- తొలుత ఫారెస్టు భూముల్లో అనుకున్నారు
- వారి అడ్డగింపుతో జాతీయ రహదారిపై స్తంభాల ఏర్పాటు

ఉలవపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):జా తీయ రహదారి మార్జిన్‌కు ఆనుకుని 33కేవీ హై ఓల్టేజీ విద్యుత్ సరఫరా స్తంభాలను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉందని స్థానిక ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. వీటితో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

● గతేడాది స్తంభాల ఏర్పాటు

మండలంలోని మన్నేటికోట వద్ద ఉన్న 132 కేవీ విద్యుత్ స్టేషన్ నుంచి గుడ్లూరు మండలం చేవూరు వద్ద నిర్మాణంలో ఉన్న ఇండోసోల్ సోలార్ ప్యానల్ తయారీ సంస్థ వరకు ఎత్తైన టవర్లు నిర్మించి గత ఏడాది విద్యుత్ సరఫరాను ప్రారంభించారు.

● 20 అడుగుల దూరంలో..

ఈ టవర్ల నిర్మాణమంతా జాతీయ రహదారి వెంట మార్జిన్‌కు 20అడుగుల దూరంలో నిర్మించారు. రాజుపాలెం, చాగొల్లు, వీరేపల్లి గ్రామాల వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఫారెస్టు భూములున్నాయి. ఫారెస్టు భూముల్లో నుంచి టవర్లు వేసేందుకు తొలుత నిర్మాణాలు చేపట్టారు. ఫారెస్టు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని వారు పనులు నిలిపేశారు. విద్యుత్ సరఫరా ఎస్టిమేట్‌లో ఇలాంటి వెసులుబాటు లేకున్నా టవర్లు బదులు తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలతో విద్యుత్ లైన్‌లు వేశారు. భవిష్యత్తులో జాతీయ రహదారిపై వెళ్లే వాహ నదారులకు పెను ప్రమాదం పొంచిఉందని ప్రజ లు చర్చించుకుంటు న్నారు. ఫారెస్టు భూ ముల హద్దు వెంట తాటిచెట్లు, ఏపుగా ఎదిగిన జామాయిల్ చెట్లు పెరిగి ఉన్నాయి. వర్షాకాలం సమ యంలో బలమైన గాలులు వీచినప్పుడు స్థంభాలు హైవే పైకి వాలే ప్రమాదం లేకపోలేదు. ప్రమాదవశాత్తు అతి వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొన్న సమయం లో రోడ్డు మార్జిన్ దాటే క్రమంలో విద్యుత్ స్థం భాలను ఢీ కొట్టినా హై ఓల్టేజ్ తీగలు వాహ నాలపై పడితే క్షణాల్లో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది.

● పూర్తి సమాచారం తెలియదు

నేషనల్ హైవే అథిరిటీకి చెందిన కొందరు అధికారులను ఈ విషయమై ప్రశ్నించగా... ఏ ప్రాతిపదిక మీద అనుమతులు ఇచ్చారో తెలియదని, ఉన్నతాధికారులను అడిగితే కానీ పూర్తి సమాచారం తెలియదని దాటవేశారు. జాతీయ రహదారి ఫెన్సింగ్ దాటి ఎలాంటి నిర్మాణం చేపట్టినా వెంటనే ఆ ప్రాంతంలో వచ్చి వాలిపోయే హైవే అథారిటీ అధికారులు వాహనదారులకు ప్రమాదం ఉందని, నిబంధనలకు విరుద్ధంగా మార్జిన్‌లో హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా చేపట్టడంలో ఉన్నతస్థాయి అధికారులు, హై లెవల్ హైవే అథారిటీ మధ్య మతలబులు జరిగి ఉంటుందని ఆ శాఖల సిబ్బంది చర్చించుకోవడం విశేషం.



వీరేపల్లి జాతీయ రహదారిపై వెలసిన హైవోల్టేజి విద్యుత్ స్తంభాలు

కేంద్ర బడ్జెట్‌తో వ్యాపార అభివృద్ధికి పరోక్ష సహకారం

టెక్స్‌టైల్ రంగంపై మార్పుల్లేవు



కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థికబడ్జెట్‌లో టెక్స్‌టైల్ రంగంపై వడ్డింపులు, రాయితీలు ప్రకటించలేదు. 5శాతం జీఎస్టీ విధించడంతో వ్యాపారం తగ్గుముఖం పడుతోంది. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కేటాయింపులు.. రాయితీలు ప్రకటించి ఉంటే అభివృద్ధికి దోహదపడేది. ఏపీలో స్పిన్నింగ్, జిన్నింగ్ పరిశ్రమలున్నా టెక్స్‌టైల్ పార్కు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ముడిసరుకు తరలించాల్సిన పరిస్థితి. ఏపీలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయించడం పేద మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగే అవకాశం ఏర్పడింది. ఇది వస్త్ర వ్యాపారానికి ఊరటనిచ్చే అంశం.

● అమరా సుబ్బారావు, ఏపీ జీఎస్టీ గ్రీవెన్సెస్ బోర్డు మెంబర్

వేతన జీవులకు వరం

● కందుకూరు:వార్షికఆదాయ పరిమితిని పెంచి రూ.12లక్షల వరకు వార్షిక ఆదాయం కలిగిన వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా చేయటం వేతనజీవులకు ఎంతో ఊరట. నెలకు రూ.లక్ష వరకు వేతనం వచ్చేవారు ఎలాంటి పన్ను చెల్లించకుండా మినహాయింపు ఇవ్వటం వల్ల కొనుగోలు శక్తి పెరిగి జీడీపీ వృద్ధికి దోహదపడుతుందన్నారు. అలాగే సా మాన్య ప్రజలకు నిత్యాసరాలుగా మారిన సెల్‌ఫోన్లు, టీవీల ధరలు తగ్గే లా అత్యవసరమైన 30రకాల మందుల ధరలు తగ్గేలా తీసుకున్న నిర్ణయం కూడా సామాన్య, మ ధ్యతరగతి ప్రజలకు ఊరట అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటా యించటంతో పాటు ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను కూడా కేంద్రమే తీసుకోవటం మేలు.

- మన్నేపల్లి వరప్రసాదరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

మధ్య తరగతి ప్రజలు బడ్జెట్



కందుకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీ తారామన్ 8వ సారి ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులతో ఇచ్చే పంట రుణాల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచటం, పప్పుదినుసుల అభివృద్ధికి ప్రోత్సాహకాలు ప్రకటించటంతో రైతు ఆదాయాన్ని పెంచేందుకు ఉపకరిస్తుంది.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు

వస్త్ర వ్యాపార అభివృద్ధికి సహకారం

కావలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పరోక్షంగా వస్త్ర వ్యాపార అభివృద్ధికి సహకారంగా ఉంది. మేజర్ అండ్ స్మాల్ ఇండస్ట్రీలకు కేంద్రం రుణ సదుపాయం రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు పెంచటం హర్షణీయం. గత మానవత ఉత్పత్తి యూనిట్లకు ఉన్న కస్టమ్స్ డ్యూటీని తీసివేయటంతో కొత్త యూనిట్ల ఏర్పాటుకు సహకారంగా ఉంటుంది. విదేశీ వస్త్రాలపై కస్టమ్స్ డ్యూటీ పెంచటంతో మన దేశ వస్త్రాలకు డిమాండ్ పెరుగుతోంది. ఆదాయపన్ను పరిమితిని రూ.12లక్షల వరకు పెంచటంతో పేద, మధ్య తరగతి ప్రజల కొనుగోలుశక్తి పెరిగి వస్త్ర వ్యాపారం పెరిగేందుకు అవకాశం ఏర్పడుతోంది.

- కందుకూరి వెంకటసత్యనారాయణ, కందుకూరి గ్రూప్ ఆఫ్ కంపెనీల చైర్మన్



అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే ఇంటూరి



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వలేటివారిపాలెం: ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మా ల కొండ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి పనులు, మహాన్నదానం, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట కందుకూరు టౌన్ ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, పొడపాటి నరసింహం, పొడపాటి శంకరయ్య వడ్డెళ్ల రవిచంద్ర, కామినేని అశోక్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉద్యోగంలో కొనసాగించేలా చూడాలని వినతి

మాలకొండలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న మమ్మల్ని ఉద్యోగంలో నుంచి తొలగించకుండా చూడాలని త్రాసుల శ్రీనివాసులు, పెగడా మల్లికార్జునరావు, ఆవుల మల్లికార్జునరావు, మారుపాకుల మల్లికార్జునరావు, కళ్లగుంట రాజేష్‌లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కందుకూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు వైసీపీకి రాజీనామా చేసి శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారందరికీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో పట్టణంలోని బృందావనం కాలనీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు దాసరి మాలకొండయ్య, గుడ్లూరు మండలం పరకొండపాడు పంచాయతీ అగ్రహారం పులి మహేంద్ర, పులి నారాయణ, మన్మథరావు, హరిశ్చంద్రప్రసాద్, మనో, మాలకొండయ్య, గంధం మాలకొండయ్య, కొండారెడ్డిపాలెం హరికృష్ణలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, తలతోటి మస్తాన్, చనమాల శ్రీధర్, పులి నాగరాజు, శ్యామ్, ఏపూరి కృష్ణ, వడ్డెళ్ల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలానికి రూ.1.2కోట్లతో ఓవీ రోడ్డులోని మాల్యాద్రి కాలనీ వద్ద నుంచి మహదేవపురం వరకు.. రూ.2కోటతో పలుకూరు అడ్డ రోడ్డు నుంచి పలుకూరు వరకు తారురోడ్డు నిర్మాణ పనులు జరుగుతాయని అధికారులు తెలిపారు.

హైదరాబాద్ సభకు తరలిరండి

కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై స్థానిక మాగుంట పార్వతమ్మ రోడ్డులోని మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ల దద్దరిల్లాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చేవూరు కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంద కృష్ణ ఆదేశాల మేరకు ఈనెల 7న హైదరాబాద్‌లో 'లక్షల డప్పులు.. వేల గొంతులు' అనే భారీ సాంస్కృతిక ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మంద వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు జీ వెంకటేశ్వర్లు, పందిటి అంబేద్కర్ మాదిగ, గేరా జానకి, అక్కిలిగుంట యేసు పాల్గొన్నారు.

● లింగసముద్రం: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు బహిరంగ సభకు మండలంలోని మాదిగ యువకులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు మాదిగ పిలుపునిచ్చారు. ఈ విషయంపై శనివారం రాత్రి వరకు గంగపాలెం, జంపాలవారిపాలెం, పెంట్రాల మొగిలిచెర్లలో నాయకులతో పర్యటించారు. కార్యక్రమంలో ప్రవీణ్, బ్రహ్మయ్య, సురేష్, కుమార్, ముసలయ్య, రాజేష్ ఉన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థికి విద్యుత్ షాక్

లింగసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థి పల్లిపాటి సందీప్ శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో గాయపడ్డాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని 8వ తర గతి చదివే సందీప్ హైస్కూల్ పూర్తయిన అనంతరం పక్కనే ఉన్న జంగంరెడ్డిపాలెం మీదుగా హాస్టల్‌కు వెళుతున్నాడు. చింతకాయల కోసం రోడ్డుపైనే ఉన్న చెట్టు ఎక్కా డు. ఈ చెట్టు గుండా వెళుతున్న సింగిల్ ఫేస్ విద్యుత్ తీగలు గమనించలేదు. తీగలు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై చెట్టుపై నుండి కిందపడ్డాడు. ఈ సంఘటనలో సందీప్ వీపు, చేతులు, కాళ్లు కాలిపోయాయి. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది సందీప్‌ను లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సందీప్‌ను 108 వాహనంలో కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి విషయాన్ని సందీప్ తల్లిదండ్రులకు తెలిపారు. వారు కందుకూరు వైద్యశాల వద్దకు చేరుకొని అక్కడ నుండి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఇన్‌చార్జ్ వార్డెన్ సీహెచ్ శ్రీనివాసులు, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.



వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

జలాశయాలను పూర్తి చేయాలి



ఆందోళన చేస్తున్న రైతులు, కూలీలు

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలను పూర్తిచేయాలని శనివారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు, కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఉదయగిరిలో బంగారం పండే భూములున్నా సాగునీరు లేక బీళ్లుగా మారి ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. 8టీఎంసీల సామర్థ్యం గల సీతారాంసాగర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.850 కోట్ల నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించిన దాఖల్లాలేవన్నారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు రూ. 2వేల కోట్లు అవసరం కాగా రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆయా జలాశయాలకు నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టి తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దాసరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు మాజీ సర్పంచ్ సయ్యద్ జమృత్‌జాఫర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో పీఎంసీ కమిటీ, విద్యార్థుల తల్లిదం డ్రులు వినతిపత్రం అందజేశారు. 9, 10వ తరగతుల కోసం 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న దుత్తలూరు, ఉదయగిరికి వెళ్లాల్సి వస్తోంద న్నారు. ఎమ్మెల్యే స్పందించి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

సర్వేలను సత్వరం పూర్తిచేయండి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ సర్వేలను వెంటనే పూర్తిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి సూచించారు. శనివారం ఆమె హసనాపురంలో పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మొదటిరోజే నూరు శాతం పించన్ల పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పించన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏరియా కోఆర్డినేటర్ రత్నమ్మ, ఏపీఎం సతీష్, పెన్షన్ పంపిణీ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ శాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ శాఖ కార్యాలయంను శనివారం స్థానిక జేడీ కాంప్లెక్స్‌లో ప్రారంభోత్సవం చేపట్టారు. ఆ శాఖ నూతన అధ్యక్షుడిగా మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమంలో సీనియర్ నాయకులు అమరా సుబ్బారావు, జిల్లా నాయకులు బ్రహ్మానందం పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం గొప్ప ఆర్థికశక్తిగా అవతరించనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ వలే పని చేయడంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు సీవీసీ సత్యం, కమల, వెంకటేశ్వర్లు, భక్తవత్సల రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల మృతి

ఉలవపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆర్భావం నుంచి తొలితరం నాయకుడు ఆత్మకూరు దామచర్ల సుబ్బారావు శనివారం మధ్యాహ్నం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు సుబ్బారావు ఇంటికి చేరుకొని సంతాపం తెలిపారు. ఆయన మరణం మాలాంటి సీనియర్ సిటిజన్స్‌కి తీరనిలోటని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు అన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

సుబ్బారావు మృతి పార్టీకి తీరనిలోటు : ఇంటూరి

అనంతరం టీడీపీ సీనియర్ నేత దామచర్ల సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటని నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆత్మకూరుకు వెళ్లి సుబ్బారావు మృతదేహానికి నివాళ్లు అర్పించారు.

విజయవంతంగా లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్ పంపిణీ

సంగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె మండలంలోని సంగం అనుబంధ గ్రామమైన వెంకటేశ్వరపురంలో ఫిబ్రవరి నెల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీవో షాలెట్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంతో ఇబ్బందులు : యూటీఎఫ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.117 రద్దు పేరుతో పాఠశాలల విలీనంతో ఇబ్బందులు తప్పవని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం వారు ఎంఈవో చలపతికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు ఎస్ మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాల పేరుతో రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలలను విలీనం చేసి మిగిలిన పాఠశాలలను 1, 2 తరగతులతో కొనసాగించాలని ప్రతిపాదనలు చేస్తోందని, దీనివలన సామాజికంగా వెనుకబడిన పిల్లలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అదే క్రమంలో ఉర్దూ మీడియం పాఠశాలలను విలీనం చేయడం వలన విద్యార్థులకు ఉర్దూ భాషను దూరం చేసినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హెచ్ మురళీకృష్ణ, షేక్ ఇమామ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కాకర్ల



గంగమ్మతల్లికి జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్‌లతో కలిసి పొన్నెబోయిన చెంచు రామయ్య గండిపాళెం జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు. తొలుత గంగమ్మ తల్లికి జలహారతి ఇచ్చారు. గండిపాళెం గ్రామంలో సీసీరోడ్లు, గోకులంషెడ్, వెంగళరావునగర్‌లో సిమెంట్‌రోడ్లు ప్రారంభోత్సవం చేసి అనంతరం పింఛన్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గండిపాళెం జలాశయాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. జలాశయ ఆవరణలో దివంగత మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచురామయ్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్లు బయ్యన్న, మధు, గండిపాళెం జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, ఐటీడీపీ నియోజకవర్గ కన్వీనర్ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, నాయకులు ఏ వెంకటేశ్వర్లు, ఆర్ నరసింహారావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ.5.32 లక్షలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.5.32లక్షల ఆదాయం వచ్చినట్లు ఆల య డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లు, కుంకుమార్చన, వివాహాలు, తల నీలాలు, వాహనపూజ, ప్రత్యేకదర్శనం, లడ్డూ ప్రసాదం, అన్నదానం తదితర వాటిపై ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

పాఠశాల తరలించరాదు

బిట్రగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు ప్రాథమిక పాఠశాలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను కొండబిట్రగుంట పాఠశాలకు తరలించరాదని విద్యాకమిటీ చైర్మన్ ఎస్‌డీ నాసీరా తెలిపారు. శనివారం ఈ విషయంపై ఎంఈవో నరసింహారావుకు వినతిపత్రం అందచేసి సమస్యలను వివరించారు. అలాగే కావలి ఆర్డీవో, ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కలిసి వినతులు అందజేశారు.

రావి కుటుంబీకుల పూజలు

బిట్రగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండబిట్రగుంట బిలకూట క్షేత్ర ముఖద్వారానికి (ఆర్చీ) శనివారం రావి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు, టీడీపీ నేత రావి విజయ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. గ్రామపెద్దల అనుమతితో సొంత నిధులతో ఆర్చీకి నూతన రంగులు వేయనున్నట్లు రావి చిన్నరంగయ్య తెలిపారు. కార్యక్రమంలో రావి పెద్ద రంగయ్య, గ్రామస్థులు ఉన్నారు.

అనుమతులు లేని లేఅవుట్లపై ఉక్కుపాదం

బిట్రగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ పరిధిలో నౌడా అనుమతులు లేని లేఅవుట్లపై మండల అధికారులు శనివారం ఉక్కుపాదం మోరు. కప్పరాళ్ళ తిప్ప జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేని లేఅవుట్ల ప్రధాన ద్వారాల వద్ద ఎంపీడీవో సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్, కార్యదర్శి జహీర్‌లు జేసీబీలో నిరోధక కాలువలు తవ్వించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోగోలులో 10 లేఅవుట్లు, జువ్వలదిన్నెలో వేసిన మూడు లేఅవుట్లకు నౌడా అనుమతులు లేవన్నారు.

ఇసుక డంపింగ్ యార్డు పరిశీలన

సంగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇసుక డంపింగ్ యార్డును శనివారం ఆర్డీవో పావని పరిశీలించారు. సంగం పెన్నానదిలో పడవల ద్వారా డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తీసేందుకు ఓ సంస్థ అనుమతి పొంది డంపింగ్ యార్డుకు ఇసుక తరలిస్తున్న విషయం విదితమే. ఈసందర్భంగా ఆమె రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇసుక డంపింగ్ యార్డులో రికార్డులు పరిశీలించారు. ఇప్పటి వరకు డంపింగ్ యార్డుకు తరలించిన ఇసుక, విక్రయించిన వివరాల నమోదు, నిల్వ ఉన్న ఇసుక రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు సోమ్లా నాయక్, వీఆర్వో సప్తగిరి ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, దత్తాత్రేయస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా వేదపండితులు గణపతి పూజ, హనుమాన్ చాలీసా పారాయణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

కొండాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలను ఎంఈఓ-2 ఆనందరావు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సమగ్ర వివరాలను పొందుపరచాలని ప్రిన్సిపల్ ఖాదర్‌బాషాకు సూచించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆరా తీసి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించేలా విద్యార్థులను తయారుచేయాలన్నారు.

'రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం'

కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 7నెలలు కావస్తున్నా రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉండి గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. శనివారం ముసునూరులోని ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో స్పష్టమైన ప్రకటన చేయక పోవడంతో లక్షలాదిమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురి అవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ఈనెల 5న ఫీజు పోరు ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా పట్టణ అభివృద్ధి

● సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు



ఆత్మకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి, ఆత్మ కూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆత్మకూరు మున్సిపాల్టీలో మౌలిక వసతులు కల్పించడం తోపాటు ఎన్న డూలేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందకు ప్రణాళికలు సిద్ధం చేస్తు న్నామని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు.

? అమృత్ 2.0 పథకం నిధులు ఎన్ని మంజూర య్యాయి.

! ఆత్మకూరు మున్సిపాల్టీకి అమృత్ 2.0పథకం కింద రూ. 15 కోట్లు నిధులు మంజూర య్యాయి. ఎంఎల్‌డి వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, స్టోరేజ్ రిజర్వా యర్స్, ఇంటింటి తాగునీటి కనెక్షన్లు, ఆత్మ కూరు చెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి, పా ర్కు అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

? నుడా నిధులెన్ని వచ్చాయి.

! నుడా ద్వారా రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపాల్టీ పరిధిలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం చేపడతాం.

? తాగునీటి సరఫరా పరిస్థితి ఏమిటి.

! ఆత్మకూరు పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజూ రక్షిత నీరందిస్తున్నాం. మంచినీటి సమస్య లేదు.

? పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

! మున్సిపాల్టీలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు పకడ్బందీగా చేపడుతున్నాం. ఇళ్ల వద్దకు వెళి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం. దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం.

అడవి ఆవులను గోశాలలకు అప్పగిస్తాం

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో రోడ్లపై సంచరించే అడవి ఆవులను గోశాలలకు, వ్యక్తిగతంగా పెంచుకునే వారికి అప్పగించాలని నిర్ణయించామని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ తెలిపారు. కొన్ని అడవి ఆవులు నిత్యం రోడ్లపై సంచరిస్తూ వాహనాలకు అడ్డుగా రావడంతో పాటు ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈక్రమంలో ఒక మారు ఆవులను అడవులలో వదిలినా తిరిగి ఆత్మకూరు పట్టణంలోకి వచ్చాయన్నారు. ఈసమస్యను శాశ్వతతంగా పరిష్కరించేందుకు వాటిని గోశాలలకు, వ్యక్తిగతంగా పెంచుకునేవారికి అప్పగిస్తామని తెలిపారు. అనంతరం వాటి సంరక్షణ తీరును పరశీలిస్తూ ఉంటామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

మర్రిపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఆత్మకూరు సీఐ గంగాధర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మర్రిపాడు బస్టాండ్ సెంటర్లో బారికేడ్లకు రేడియం స్టిక్కర్‌ను ఎస్‌ఐ శ్రీనివాసులు ఏర్పాటుచేశారు. వాటిని సీఐ పరిశీలించి వాహనదారులు నిదానంగా వెళ్లాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలను వాహనదారులకు వివరించారు.

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

సీతారామపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో మస్తాన్‌వలి సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఫైబర్‌నెట్ మెటీరియల్, జియో సిమ్‌లు, బాత్రూం క్లీనింగ్ కెమికల్స్‌ను మండలంలోని 40 పాఠశాలలకు ఎంఈవో పంపిణీ చేశారు.

వైభవంగా జీర్ణోద్ధరణ పూజలు

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా, ఆదివారం త్రిదండి చిన్నజీయర్‌స్వామి ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు

మీ సమస్యలను పట్టించుకోకుంటే నాతో చెప్పండి

● విలియమ్స్‌పేటలో పింఛను పంపిణీలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నాయకులు, అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోకున్నా, సమస్యల పరిష్కారానికి డబ్బులు అడిగినా వెంటనే నాతో చెప్పాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని విలియమ్స్‌పేటలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు తాగునీరు, గుడులు, రచ్చబండ ఇలాంటివి కొన్ని సమస్యలను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, లక్ష్మీకాంతమ్మ, గోవర్ధన్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.


పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

వేదగిరిపై రథసప్తమి వేడుకలు

● తొలిసారిగా ఏడు వాహన సేవలు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రంలో ఈనెల 4న రథసప్తమి వేడుకలు వైభవంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో గోపి తెలిపారు. శనివారం బ్రోచర్లను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం ఈవో మాట్లాడుతూ రథసప్తమి రోజున ఏడు వాహన సేవలను తొలిసారిగా నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈనెల 8న బీష్మఏకాదశి వేడుకలు కూడా ఘనంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బాస్కరా చార్యులు పాల్గొన్నారు.


బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

శ్రీధర్‌తో విభేదాల్లేవు : మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాల్లేవని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తేల్చి చెప్పారు. నగరంలోని ఆరో డివిజన్ పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి ఈ మధ్యకాలంలో చేసిన వ్యాఖ్యలు తప్పేమి కాదన్నారు. కార్పొరేషన్ అధికారులు కూడా వయామీడియాగా నడుచుకోవాలని తెలిపారు. సిటీప్లానింగ్, నుడా అధికారులతో తాను ఈ విషయమై స్వయంగా మాట్లాడానని తెలిపారు.ఫ్లెక్సీలు, బోర్డులు ఎవరి ఇళ్లపై వాళ్లు పెట్టుకుంటే తనకు ఎలాంటి ఇబ్బందిలేదని, రోడ్లపై ఏర్పాటు చేస్తేనే తీసేస్తామన్నారు.

రూ. కోటి ప్రజావసరాలకే ఖర్చు : గిరిధర్

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సౌత్‌మోపూరు గ్రామ అభివృద్ధికి కేటాయించిన రూ. కోటి ప్రజావసరాలకే ఖర్చు చేస్తామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో 'గడప గడపకు' కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మంగళవారం రోజు సౌత్‌మోపూరులో ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం లో సమస్యలు స్వీకరించిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రూ.కోటి నిధులు కేటాయించారని తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రజల అవసరాలను గుర్తించి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పముజుల ప్రదీప్, రాపూరు చంద్ర శేఖర్, తుళ్లూరు రామయ్య, అన్నం సుధాకర్, పెంచలయ్య, గోపాలయ్యలు పాల్గొన్నారు.


వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

చెత్త తరలింపును అడ్డుకున్న ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలియమ్స్‌పేటలో డంపింగ్ యార్డుకు బుచ్చి నగర పంచాయతీలోని చెత్తాచెదారాల తరలింపును శనివారం గ్రామస్థులు అడ్డుకున్నారు. సుమారు రెండు గంటలపాటు చెత్త తరలించే ట్రాక్టర్లను అడ్డుకుని వెనక్కి పంపించేశారు. చెత్త సమస్యపై ఎమ్మెల్యేకి ఏకరువు పెట్టారు. అధికారులకు చెప్పినా మళ్లీ చెత్త ట్రాక్టర్లు రావడంపై గ్రామస్థులు మండిపడ్డారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని సర్దిచెప్పినా ససేమిరా అనడంతో వెనుదిరిగారు. మళ్లీ చెత్త తరలిస్తే తిరుగుబాటు ఎదురవుతుందని హెచ్చరించారు.

నాడు ఫీజులు ఎగ్గొట్టి.. నేడు పోరుబాట ఏంటి?

పొదలకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మేనమామనంటూ విద్యార్థులను, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన కంస మామ మాజీ సీఎం జగన్ నేడు రాజకీయ లబ్ధి కోసం ఫీజులపై పోరుబాట నిర్వహిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ విమర్శించారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.3 వేల కోట్ల జగన్ ఫీజు బకాయిలు పెట్టగా కూటమి ప్రభుత్వం రూ.800 కోట్ల బకాయిలు విడుదల చేసిందన్నారు. ఇంకా ఏమొఖం పెట్టుకుని ఈనెల 5వ తేదీ ధర్నా చేస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేస్ ఇంటర్నేషనల్‌లో ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో శనివారం కళాకృతి పేరుతో ఆర్ట్‌క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్న పద్ధతుల్లో తయా రుచేసిన విభిన్న కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యర్థపదార్థాలతో త యారైన కళారూపాలను తీర్చిదిద్దిన చిన్నా రుల ప్రతిభను అతిథులు, ఆహుతులు, తల్లిదం డ్రులు అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాళ్లు జాస్మిన్, నాగేంద్ర, ఏవో సునీల్, మేనేజర్ అజయ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన శ్రీమతి గండవరపు అనిత భర్త గండవరపు శివయ్య, డోర్ నెం.20-487రు, వాటర్ ట్యాంకు రోడ్డు, మూలపేట, నెల్లూరుసిటీ అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా- నా క్లయింట్ నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం పంచాయితీలో చేరిన, పొట్టేపాళెం గ్రామంలోని సర్వే నెం.293, 294/బి, 294/సి, 295/ఎ, 295/బి, 297/5, 297/6 మరియు 299/1ల్లలోని భూమి లేఅవుట్ చేయబడిన ప్లాను దాఖలా సర్వే నెం.293రు లోనికి రాబడిన ప్లాట్లలో నెం.15ఎ రు ప్లాటు విస్తీర్ణం 15.42 అంకణములు లేక 123.36 చదరపు గజములు గల స్థలమును శ్రీమతి ఇందూరు స్వప్న భర్త ఇందూరు శ్రీనివాసులు రెడ్డి అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది:20-10-2022 డాక్యుమెంటు నెం.15559/2022 Nellore (R.O) ద్వారా కొనుగోలు చేసినారు. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంట్లలో ఒకటైన రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 22-11-2012 డాక్యుమెంటు నెం.9729/2012 Nellore (R.O) రును కవరులో పెట్టుకొని తే.27-01-2025 దీన నా క్లయింట్ తన నివాసం నుండి పొట్టేపాళెం గ్రామము నకు వెళ్ళి అక్కడ పని చూసుకొని సదరు గ్రామంలోని సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటును జిరాక్స్ తీసుకొనుటకు షాపు వద్దకు పోవుచుండగా మార్గమధ్యంలో పోయినది. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.9729/2012రు ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటును ఉపయోగించి ఎవ్వరైనా ఏట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

షేక్ జావీద్, B.Com., L.L.B.,
అడ్వకేట్, అంబేద్కర్‌నగర్, నెల్లూరు క్లబ్ ప్రక్కన, దర్గామిట్ట, నెల్లూరు-3. సెల్: 70137 56432

నిరుద్యోగులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కోళ్ల పెంపకం కోసం పశుసంవర్ధకశాఖ ద్వారా సహకారం అందిస్తామని, తద్వారా కోళ్ల ఫారాలు ఏర్పాటు చేసుకుని నిరుద్యోగులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ పేర్కొన్నారు. నెల్లూరులోని టౌన్‌హాలులో శనివారం సెంటర్ ఫర్ ఎంటర్ ప్రీనియర్‌షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ) ఆధ్వర్యంలో నాటు, బాయిలర్ కోళ్ల పెంపకంపై ఉచిత అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎస్.జయచంద్రారెడ్డి, సీఈడీ సంస్థ డైరెక్టర్ బీ వెంకట్, ఎంపెడా సీపీఏ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో
ది. 02-02-2025 నుండి ది. 05-02-2025 వరకు 4 రోజులు మాత్రమే
రాజరాజేశ్వరి కళ్యాణ మండపం
దర్గా మిట్ట, నెల్లూరు.
● గద్వాల్ పట్టు చీరలు ● బెనారస్ పట్టు చీరలు ● వెంకటగిరి పట్టు చీరలు
● భాగల్‌పూర్ శారీస్ ● పోచంపల్లి శారీస్ డ్రస్ మెటీరియల్స్ & టాప్స్
● చెందేరి శిల్క్ శారీస్ ● కాంతా వర్క్ బూటా శారీస్ ● ఉప్పాడ పట్టు శారీస్
● గద్వాల్ కాటన్ శారీస్ ● నారాయణపేట శారీస్ ● మాధవరం శారీస్
● జైపూర్ బెడ్‌షీట్స్ ● టవల్స్, లుంగీలు ● కలంకారి శారీస్
● మంగళగిరి కాటన్ ● 1 గ్రా జ్యువెలరీ ● హైదరాబాద్ పెరల్స్ ఐటమ్స్
పలు రాష్ట్రాల నుండి తయారు చేసిన చేనేత వస్త్రాలు తయారీ ధరలకే అమ్మకాలు
మా వద్ద పాత పట్టు చీరలు, జరీ చీరలు కొనబడును



ఆనందం నింపిన బడ్జెట్

అన్ని వర్గాల్లోనూ

వేతన జీవుల హర్షాతిరేకాలు

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేతనజీవుల ఆనందానికి అవధులు లేకుండా ఉన్నాయి. వారి ఆనందం వారి వారి మాటల్లోనే..

- నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులకు భారీ ఊరట



కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు భారీ ఊరట నిచ్చింది. రూ.12 లక్షల వరకు ఆదా యపుపన్ను మినహాయింపు ఇవ్వటం హర్షణీయం. రూ12 లక్షల నుంచి రూ.16లక్షల వరకు15 శాతం పన్ను బాగుంది.

- అల్లంపాటి పెంచలరెడ్డి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు

వాణిజ్య రంగాలకు పెద్దపీట



వ్యాపార, ఎగుమతి, ఉత్పత్తి రంగాలకు కేంద్ర బడ్జెట్ పెద్ద పీట వేసింది. చిన్నతరహా పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ సెక్టార్ కింద వచ్చే పరిశ్రమలన్నింటికి కూడా బ్యాంకుల ద్వారా అందే ఆర్థిక సహాయం, ఇతర లావాదేవీల్లో అనుకూలమైన వెసులుబాటు కల్పించింది.

- ఒమ్మిన సతీష్, ఉపాధ్యక్షుడు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్

ఆ మార్పులు చేసి ఉండాల్సింది



బడ్జెట్‌లో పాత ఆదాయపన్ను శ్లాబులు మార్చక పోవడం సామాన్య వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించే అంశం. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని పాత పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్యతరగతి వర్గాలకు, వేతనజీవులకు మేలు జరిగేది. నూతన పన్ను విధానంలో రూ.12లక్షల ఆదాయం వరకు ఉండే వారికి ఇచ్చే రిబేటును, పాత పన్ను విధానంలో ఉండే వారికి కూడా వర్తింప చేసి ఉంటే బాగుండేది. సేవింగ్స్ పరిమితిని కనీసం రూ.2.5లక్షలకు పెంచి ఉంటే పొదుపు చేసుకోవడానికి ప్రోత్సాహం ఉండేది.

- అల్లంపాటి సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఊరట లేని బడ్జెట్



ఈ బడ్జెట్‌లో ఉద్యోగులకు టాక్స్ పరంగా పెద్ద ఊరట లభిస్తుందని ఆశతో అందరూ ఎదురు చూశారు. కానీ నిర్మలమ్మ అందరి ఆశలపై నీరుగారుస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.12లక్షల వరకు సున్నా టాక్స్ వెనుక కూడా మతలబు పెట్టడం నిరాశ పరిచింది. రూ.4లక్షల వరకే సున్నా టాక్స్ ఆ తర్వాత రూ.8లక్షల సేవింగ్స్ చేసుకుని చూపిస్తేనే దానిపై సున్నా టాక్స్ ఉంటుందని లేకుంటే టాక్స్ కట్టాల్సి ఉంటుందని ప్రకటించడం ఉద్యోగులకు నష్టమే. అంత సేవింగ్స్ చేస్తే ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించడం కష్టంగా మారుతుంది. ఈ బడ్జెట్ ప్రకటనతో వేతనజీవులకు ఎలాంటి ఉపయోగం లేకపోవడం బాధాకరమే.

- చిట్టేటి రమేష్, బీటీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వేతన జీవులకు శుభవార్త



కేంద్రబడ్జెట్ వేతన జీవులకు శుభవార్త చెప్పింది. ఆదాయపు పన్నుపై భారీ ఉపశమనం కలిగింది. విశ్రాంత ఉద్యోగులు కొంత వరకైనా వారికి వచ్చే పెన్షన్‌లోపన్ను మినహాయింపు పొందటం ఆనందంగా ఉంది.

- షేక్ ఖాసీం, విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూవో

ఊరట కల్గించే బడ్జెట్



ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్ ఎంతో ఊరట కలిగించింది. ఉద్యోగులకు రూ.12.5లక్షల వరకు పన్ను లేకపోవటం ఆనందదాయకం. పొదుపు పరిమితి 1.5 లక్షల నుంచి రూ.5లక్షల వరకుపెంచితే అన్నీ వర్గాల ప్రజతోపాటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చి ఉండేది.

- కోటేశ్వరరావు, ప్రభుత్వ ఉద్యోగి

75 వేల సీట్ల లక్ష్యం హర్షణీయం



కేంద్ర బడ్జెట్‌లో వచ్చే ఐదేళ్లలో వైద్యకళాశాలల్లో అదనంగా 75వేల సీట్లు లక్ష్యంగా పెట్టుకోవటం హర్షణీయం. ఈ మెడికల్ సీట్ల పెంపుతో వచ్చే ఐదేళ్లలో నీట్‌కు శిక్షణ పొందే మధ్యతరగతి విద్యార్థులపై వత్తిడి తగ్గుతుంది.

- గ్రీష్మ, వైద్య విద్యార్థిని

పాతపన్ను విధానంలో మినహాయింపులు లేవు



పాత పన్ను విధానంలో కూడా కొన్ని మినహాయింపులు ఉంటాయని ఆశించాం. కొత్త పన్ను విధానంలో వేతన జీవులకు ఊరట కలిగే అవకాశాలు ఉన్నాయి. పాత విధానంలో మార్పు లేక పోవటంతో వివిధ మినహాయింపులు ఉన్న వారికి ప్రయోజనం తక్కువే.

- జీ సుధాకర్‌రెడ్డి, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు

వేతనజీవులు పాలిట వరం



వ్యక్తిగత పన్ను స్థాయిని రూ.12 లక్షలకు పెంచడం వేతనజీవుల పాలిట వరంలా పరిగణించవచ్చు. పేద కేన్సర్ రోగులకు ఉచిత మందులు అందించేలా నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేది. వైద్య, విద్యను మరింత మందికి అందించే దిశగా రానున్న ఐదేళ్లలో 75వేల సీట్లను పెంచడం హర్షనీయం. పన్ను చట్టాలను మరంత సరళీకృతం చేసే లక్ష్యంతో వచ్చే వారం నుంచే ప్రక్రియ ప్రారంభం కానుండటం గొప్ప విషయం.

- చిన్ని శ్రావణ్‌కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్

కొంతవరకు ఉపశమనం



కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వేతన జీవులకు కొంతవరకు ఉపశమనం కలిగించే అంశమే. రూ.12లక్షల వరకు టాక్స్ చెల్లించాల్సిన అవ సరం లేదని, స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేలు.. మొత్తంగా రూ.12.75 లక్షల వరకు టాక్స్ చెల్లింపులు లేవు. ఇది సామాన్య, మధ్యతరగతి వారికి ఉపశమనం కలిగించే బడ్జెట్‌గా ఉంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి కూడా ప్రాజెక్టులు, విశాఖ స్టీల్, పోర్టు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం శుభ పరిణామం. ఈసారి బడ్జెట్ కొంత సానుకూలంగానే ఉంది.

- రామచంద్ర యాదవ్, టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు

భారీ ఊరట



వేతనం మీద మాత్రమే ఆధారపడే మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితి రూ.12లక్షలకు పెంచడంతో ఊహించని భారీ ఊరట లభించింది. ఆదాయపన్ను పరిమితి రూ.7లక్షల నుంచి 12 లక్షల వరకు పెంచడంతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఉపశమనం కలిగిస్తుంది. విద్యారంగంలో రూ.500కోట్లతో ఏఐ ఎక్సలెంట్ సెంటర్ ఏర్పాటు, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్‌బ్యాండ్ సేవలు, పాఠశాలల్లో 50వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు, పాఠ్యపుస్తకాలను డిజిటల్‌గా అందించేందుకు భారతీయ భాషా పుస్తక్ పథకం, ఐఐటీలో, మెడికల్‌లో సీట్లు పెంచడం వంటి అంశాలు విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత కలిగించేవిగా ఉన్నాయి.

- కేకే.రాజగోపాలాచార్యులు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం



కేంద్ర బడ్జెట్ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది. రూ. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రకటించటం దేశ చరిత్రలో ఇదే ప్రథమం, ఆదాయపు పన్ను విషయంలో ఉద్యోగులు ఎంతో ఆనందంతో ఉన్నారు.

- చేజర్ల సుధాకర్‌రావు, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు

ఈ సెంటర్ నుంచే రాజకీయాల్లోకి..

● ఆర్ఎస్ఆర్ పూర్వ విద్యార్థులతో సోమిరెడ్డి



స్నేహితులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నన్ను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది ఈ సెంటరే... లేదంటే స్నేహితుల్లా తాను కూడా ఏదో ఒక ఉద్యోగం చేసే పరిస్థితి ఉండేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల 1969-70 టెన్త్ బ్యాచ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనతోపాటు చదువుకున్న కొందరు డాక్టర్లు, యూనివర్సిటీ డీన్లు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, అడ్వకేట్‌లుగా ఉన్నారన్నారు. వీరంతా కూడా ప్రశాంతమైన జీవితం సాగిస్తున్నారన్నారు. తనలాగా నిత్యపోరాటాలు, ఆర్థిక సమస్యలు, చివరకు శ్రీనివాస మహల్‌ను అమ్మే పరిస్థితులు లేకుండా అంతా సంతోషంగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. తాము చదువుకునే రోజుల్లో మా శ్రీనివాస మహల్ రాజకీయాలకు కేంద్రంగా ఉండేదని గతాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం స్నేహితులతో కలిసి పాత విషయాలను గుర్తు చేసుకున్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

తోటపల్లిగూడూరు : ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముంగలదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.30 దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రారంభించిన సామాజిక పింఛన్ అంచలంచెలుగా పెరిగి నేడు రూ.4 వేలకుచేరిందన్నారు. ప్రతిసారి చంద్రబాబునాయుడు పాలనలో ఈ పింఛన్ రెట్టింపు కావడాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. దీంతో పాటు రాష్ట్రానికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, మద్దిన గోపాల్‌నాయుడు, గుడ్లూరు గోపాల్ నాయుడు, చావా కోటయ్యనాయుడు, గుడ్లూరు వెంకయ్య నాయుడు, చుక్కపల్లి మల్లి, పాల్గొన్నారు.

ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు మండలంలోని పల్లె, పల్లెకాపు, వన్నెకాపు, వన్యకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ కులాలకు చెందిన వారు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంఘం జాయింట్ సెక్రటరీ వేగూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి రూ.896.79 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు.

టీడీపీలో చేరిన కౌన్సిలర్ దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : వైసీపీకి చెందిన బుచ్చి 19వ వార్డు కౌన్సిలర్, మాజీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలిత, ఆమె భర్త శ్రీకాంత్‌రెడ్డి శనివారం టీడీపీ తీరం పుచ్చుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఈనెల 3వ తేదీ జరగనున్న వైస్ చైర్మన్ల ఎన్నిక నేపథ్యంలో వైసీపీ కౌన్సిలర్లు రోజుకొకరు చొప్పున ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. దీంతో టీడీపీలో బలం పుంజుకుంటోంది. ఎన్నిక లోపు ఇంకెంతమంది వైసీపీని వీడుతారోనన్న చర్చ జరుగుతోంది.

ప్రజా సమస్యలు పరిష్కరించండి సార్..


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దారు వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించండి సార్.. అని పెనుబల్లి ఎంపీటీసీ సీహెచ్ వినయ్ నారాయణ వేడుకున్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎం. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాసుపత్రుల్లో 24 గంటలు వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కనిగిరి రిజర్వాయర్ కరకట్టలపై ప్రకృతి సంపద గ్రావెల్ తరలింపు, అక్రమ భవనాల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా వివిధ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం) : కపాడిపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్దబావి ప్రాంతానికి చెందిన ఓ యువతి కుటుంబసభ్యుతో కలిసి శనివారం బంధువుల గృహప్రవేశానికి వెళ్లింది. భోజనం తీసుకు వెళ్లేందుకు ఇంటికి వెళ్లి క్యారియర్ తీసుకువస్తానని వెళ్లింది. ఆమె ఎంత సేపటికి రాకపోవడంతో కుటుంసభ్యులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుల్తాన్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● వైద్యుడిని బెదిరించిన వ్యక్తిపై...

ఓ వైద్యుడిని బెదిరించిన వ్యక్తిపై బాలాజీనగర్ పోలీ సులు శనివారం కేసు నమోదు చేశారు నగరానికి చెందిన డాక్టర్ పవన్‌కుమార్ వెంకటరామాపురంలో వైద్యశాల నిర్వహిస్తుండగా, ముత్తుకూరు మండలం మామిడిపూడికి చెందిన కిరణ్ డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్నాడు. గతనెల 31న వైద్యశాల నుంచి ఇంటికి వెళుతున్న డాక్టర్‌ను బాలాజీనగర్‌లో అడ్డుకుని బెదిరించగా, బాధితుడు శనివారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

16న విశ్రాంత ఉద్యోగుల వార్షికోత్సవం

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఏపీ మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ 4వ వార్షికోత్సవం ఈనెల 16న ఆ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి కల్పం శ్రీనివాసులు తెలిపారు. ఈ వేడుకలకు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతను ఆయన నాయకులతో కలిసి శనివారం ఆహ్వానించారు.

ఈవోకి మంత్రి ఆనం పరామర్శ

వెంకటాచలం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గొలగముడి భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) బాలసుబ్రహ్మణ్యంను శనివారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. మండలంలోని గొలగమూడి గ్రామంలో ఉన్న ఈవో నివాసానికి మంత్రి చేరుకుని జ్వరంతో బాధపడుతున్న బాలసుబ్రహ్మణ్యాన్ని పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

షాన్‌వాజ్‌కు సీపీఐ నేత...

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఐ నాయకుడు షాన్‌వాజ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శనివారం పరామర్శించారు. నెల్లూరులో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు వచ్చిన ఆయన నారాయణరెడ్డిపేటలో అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న ఆ పార్టీ నాయకుడు షాన్‌వాజ్‌ను పలకరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దామా అంకయ్య, అరిగెల నాగేంద్రసాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శునకాల అందాల పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో ఆదివారం శునకాల అందాల పోటీలను నిర్వహించనున్నట్లు నెల్లూరు కెన్నెల్ క్లబ్ ప్రెసిడెంట్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్యదర్శి బీ సురేంద్ర బాబు, కోశాధికారి ఐ.రాజు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు వసంత పంచమి

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్నీ అమ్మవారి ఆలయాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. విద్యాదేవత సరస్వతీదేవి జన్మదినమే వసంత పంచమి. ఈ సందర్భంగా అన్నీ ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీపూజలు, హోమాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

మధ్య తరగతి మందహాసం

- ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులకు మేలు
- రైతులు, చిన్న పారిశ్రామికవేత్తలకు రుణ పరిమితి పెంపు
- కేంద్ర బడ్జెట్‌తో మూడు నాలుగు వర్గాలకు ప్రయోజనం



కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లాలో ప్రధానంగా మూడు నాలుగు వర్గాలకు ప్రయోజనం కలిగించనుంది. ఆదాయ పన్ను పరిమితిని పెంచడంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగులు, పెన్షనర్లు, అలాగే వ్యాపార వర్గాలకు మేలు జరగనుంది. వారిపై ఆదాయ పన్నుభారం తగ్గనుంది. అదేవిధంగా పీఎం కిసాన్ కార్డులు కలిగిన రైతులకు రుణ పరిమితి పెంచడం వల్ల జిల్లాలో వారికి కూడా అధిక మొత్తం రుణాలు అందనున్నాయి. మరోవైపు ఎంఎస్ఎంఈలకు సైతం కొత్త బడ్జెట్‌లో రుణ పరిమితిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా జిల్లాలో ఇప్పటికే ఉన్న ఎంఎస్ఎంఈ యూనిట్ల యజమానులతో పాటు కొత్తగా ఏర్పాటు చేయనున్న వారికి కూడా రెట్టింపు రుణాలు అందే అవకాశాలు ఏర్పడ్డాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులకు మేలు



జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 30 వేల మంది ఉన్నారు. అలాగే 17,500 మంది పెన్షనర్లు ఉన్నారు. బీఎస్ఎన్ఎల్, రైల్వే, పోస్టల్, షార్, కేంద్రీయ విద్యాలయాలు, జాతీయ సంస్కృతి వర్సిటీ, ఐఐటీ, ఐసర్ వంటి సంస్థల్లో పది వేల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తుండగా అంతే మంది పెన్షనర్లు ఉన్నారు. సుమారు 70 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లలో 50 శాతం మందికి పైగా అంటే 35 వేల మంది రూ.లక్షకు పైగా వేతనం లేదా అంతే మొత్తంలో పెన్షన్ పొందేవారున్నారు. కొత్త బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితి రూ.7.75 లక్షల నుంచి ఏకంగా రూ.12 లక్షలకు పెంచుతూ కేంద్రం నిర్ణయించింది. దీంతో 30 వేల నుంచి 35 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఆదాయ పన్ను పరిమితి పెంపు వల్ల లబ్ధి పొందడానికి అవకాశం ఏర్పడింది. వీరిపై ఆదాయ పన్ను భారం గణనీయంగా తగ్గనుంది. అదేవిధంగా జిల్లాలో రూ.12 లక్షల వరకూ ఆదాయం పొందే వ్యాపారులు సైతం దీనివల్ల లబ్ధి పొందనున్నారు.

10 వేలకు పైగా చిన్న పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం



సూక్ష్మ, స్వల్ప, మధ్య తరహా పరిశ్రమలు నడిపే పారిశ్రామికవేత్తలకు, అలాంటి చిన్న తరహా యూనిట్లు ఏర్పాటు చేసే వారికి ఇప్పటివరకూ ప్రభుత్వం రూ.5 కోట్ల వరకూ రుణాలు అందిస్తోంది. అయితే కొత్త బడ్జెట్‌లో ఆ రుణ పరిమితిని రెట్టింపు చేస్తూ రూ.10 కోట్లకు పెంచింది. జిల్లాలో ప్రస్తుతం 10,426 ఎంఎస్ఎంఈ యూనిట్లు నడుస్తున్నాయి. వీటిని నడుపుతున్న పారిశ్రామికవేత్తలు ఇకమీదట రూ.10 కోట్ల వరకూ రుణాలు తీసుకునే అవకాశమేర్పడింది. ఇప్పటికే రుణాలు తీసుకుని ఉంటే వాటిని క్లియర్ చేయగానే ఈ పెంచిన మొత్తాలు రుణాలుగా పొందే వీలుంది. అలాగే రుణ బకాయిలు లేని వారు, కొత్తగా యూనిట్లు పెట్టే వారికి కూడా ఈ రుణ సదుపాయం మేలు చేయనుంది. ఈ నిర్ణయం జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు గణనీయంగా తోడ్పాటునందించే అవకాశాలున్నాయి.

1.60 లక్షల మంది రైతులకు పెరగనున్న రుణ పరిమితి



కేంద్ర బడ్జెట్‌లో పీఎం కిసాన్ కార్డు కలిగిన రైతులకు రుణ పరిమితిని ఇపుడున్న రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు కలిగిన రైతులు 1,59,638 మంది ఉన్నారు. వీరికి ఇకపై పంట రుణాల మొత్తాలు రూ.5 లక్షల వరకూ తీసుకునే అవకాశం రానుంది. దీనివల్ల పంటలకు అధికమొత్తం పెట్టుబడులు పెట్టడానికి వీలు కలగనుంది. ఆ మేరకు పంట దిగుబడులు, ఆదాయాలు కూడా రైతులకు గణనీయంగా పెరిగే అవకాశముంది.

వికసిత భారత్‌కు రోడ్ మ్యాప్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఒక రోడ్ మ్యాప్. ప్రధాని మోదీ దార్శనికతకు, దేశ స్వావలంబన, అభివృద్ధి, ప్రజా శ్రేయస్సుకు నిదర్శనం. రైతుల సంక్షేమానికి బడ్జెట్ పెద్దపీట వేసింది. మధ్య తరగతికి ఎంతో ఉపశమనం కల్పించింది. మహిళలు, యువత సాధికారతకు పట్టు గొమ్మ. స్టార్టప్‌లకు మంచి ప్రోత్సాహాన్నిచ్చింది.

- జి.భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు

నిరాశాజనకంగా బడ్జెట్



కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. వేతన జీవులకు అనుకూలంగా లేదు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే వరాల బడ్జెట్‌గా మారింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న అంశం ప్రకటించకపోవడం, విశాఖ ఉక్కు పరిశ్రమకు అవసరమైన గనులను కేటాయించకపోవడం, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే ఇది కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్‌గా నిలుస్తోంది.

- కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మధ్య తరగతికి మేలు



మధ్య తరగతి ఆదాయ వర్గాల వారికి సానుకూలంగా ఉంది. ఒకప్పుడు రూ.3 లక్షల నుంచీ ఆదాయ పన్ను ఉండేది. ఇప్పుడు ఆదాయ పన్నులో కొన్ని దశలను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. వ్యాపారవేత్తలకు ఉడాన్ సర్టిఫికెట్ ద్వారా రూ. 1 వడ్డీతో రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించి అభివృద్ధి చేసే ప్రణాళిక ఉంది.

- మోహనకుమారరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపు శుభ పరిణామం



సామాన్య ప్రజలకు మేలుచేసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి ఈ నిర్ణయం దోహద పడుతుంది. దేశంలోని మెజారిటీ ప్రజలకు పన్ను మినహాయింపు ఇవ్వడం గొప్ప నిర్ణయం. ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా ఈ నిర్ణయం మంచి ప్రయోజనాన్ని కల్గిస్తుంది. ఎక్కువ కుటుంబాలకు పన్ను మినహాయింపు కొత్త ఆదాయ పన్ను శ్లాబులు రూపొందించడం బాగుంది.

- డాక్టర్ కె.సునీత, ఎకనమెట్రిక్స్ విభాగం, ఎస్వీయూ

ఉద్యోగులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు కొంత మేర ఊరట లభించింది. గతంలో రూ.7లక్షల వరకు పన్నుభారం లేకుండా ఉండేది. ఈ బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు పెంచడం శుభపరిణామం, గతంలో పోల్చుకుంటే చిరుద్యోగులకు లాభం చేకూరే విధంగా కనిపిస్తోంది.

- సురేష్‌బాబు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు, తిరుపతి

అభివృద్ధే లక్ష్యంగా..



పేదలు,రైతులు, మహిళలు, యువకుల అభివృద్ధే లక్ష్యంగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉంది. 2047నాటికి ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారయ్యే బడ్జెట్ ఇది. రాష్ట్రానికి పోలవరం, రాజధాని, రైల్వేలు, జాతీయ రహదారులు, విశాఖ స్టీల్‌ప్లాంట్, విమానాశ్రయాల పునరుద్ధరణ వంటి వాటికి ఆశాజనకమైన కేటాయింపులు ఇచ్చారు.

- కోలా ఆనంద్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

వేతన జీవులకు ఊరట



వేతనం మీద ఆధారపడే ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కేంద్ర బడ్జెట్ ఊరటనే చెప్పాలి. ఆదాయ పన్ను స్లాబు రేట్లు పెంచి పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడం హర్షణీయం. ఒక నెల నుంచి రెండు నెలల జీతాన్ని ఆదాయ పన్ను రూపంలో చెల్లిస్తున్న ఉద్యోగులకు ఇది తీపి వార్త. ఒకేసారి ఐదు లక్షల రూపాయల మేరకు ఆదాయ పన్ను పరిమితి పెంచడం దేశ బడ్జెట్ చరిత్రలో ఇదే మొదటిసారి.

- శవన్నగారి బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతిలో వేడెక్కిన రాజకీయం

- డిప్యూటీ మేయర్ ఎన్నికతో అనూహ్య పరిణామాలు
- వైసీపీ కార్పొరేటర్ల క్యాంపులు, కూటమి నేతల చర్చలు
- అక్రమ నిర్మాణాలపై కార్పొరేషన్ కొరడా
- కూటమి చెంతకు శేఖర్ రెడ్డి
- నేడు టీడీపీ కండువా కప్పుకునే అవకాశం
- వైసీపీ నుంచి కొత్త అభ్యర్థిని ప్రకటించిన భూమన



ఎక్స్‌కవేటర్‌తో భవనం కూల్చివేస్తున్న దృశ్యం

తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో శనివారం తిరుపతి పొలిటికల్ హైడ్రామాకు వేదికైంది. వైసీపీ నుంచి డిప్యూటీ మేయర్‌గా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ రెడ్డిని రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో 20 మంది కార్పొరేటర్లతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. శేఖర్ రెడ్డి నేతృత్వంలో క్యాంపు రాజకీయాల్లో ఆరితేరిన వారిని రంగంలోకి దింపి తమిళనాడు రిసార్ట్‌లో రెస్ట్ తీసుకుంటున్నారు. ఇంతలో ఊహించని పరిణామాలు తిరుపతిలో చోటు చేసుకున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి చేరుకుని డిప్యూటీ మేయర్ ఎన్నికపై కూటమి నేతలలో చర్చిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి నగర పాలకసంస్థ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించడంతో రాజకీయ రగడ మొదలైంది. ముఖ్యంగా శేఖర్ రెడ్డి ఆస్తులపై ఫోకస్ పెట్టడంతో వైసీపీ శ్రేణులు కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఇంతలో శేఖర్ రెడ్డి టీడీపీలో చేరేందుకు సిద్ధపడ్డారు. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి సమక్షంలో కూటమి పెద్దలతో మంతనాలు జరిగినట్టు తెలిసింది. ఆదివారం ఆయన టీడీపీలో చేరబోతున్నట్టు తెలుస్తోంది. కాగా, శనివారం సాయంత్రం వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కూటమి నాయకుల చర్యలను తప్పుబట్టారు. మరో వైసీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కరరెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. తమ హయాంలో ఇలాంటి కుట్రపూరిత పనులు చేయలేదని చెప్పుకొచ్చారు. అయితే గత మున్సిపల్ ఎన్నికల సమయంలో టీడీపీకి చెందిన ఆర్సీ శ్రీనివాసులు తన భార్య కార్పొరేటర్‌గా పోటీ చేస్తుందన్న కారణంగా అతని జీవనాధారమైన టీషాపును తొలిగించిన ఘటనను పలువురు ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు. ఇదిలా వుండగా కూటమి పార్టీ నుంచి అభ్యర్థిపై కసరత్తు జరుగుతోంది. టీడీపీ నుంచి గెలిచిన ఒకే ఒక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, అసమ్మతి కార్పొరేటర్లను కూటమి వైపునకు తీసుకొచ్చేందుకు కృషిచేసిన నరసింహాచారి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఈనెల 3న జరగబోయే డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఇంకెన్ని విచిత్రమైన పరిణాలు చోటుచేసుకుంటాయో చూడాల్సి ఉంది.



అభినయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

పుస్తకాల పండుగ ప్రారంభం

- 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీకృష్ణ



పుస్తకాలను తిలకిస్తున్న జస్టిస్ శ్రీకృష్ణ, ఆర్వీ కుమార్, సత్యనారాయణరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పుస్తకాల పండుగ ప్రారంభమైంది. పది రోజుల పాటు సాగే 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ పుస్తక విజ్ఞానంలో భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. ఈ వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు చదవడం వల్ల మనుషుల్లో సమాజం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ పుస్తకాలు మనుషులను మంచి ఆలోచనలు, మంచి మార్గం, మంచి లక్ష్యం వైపు నడిపిస్తాయన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాలన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద మాట్లాడుతూ పుస్తక అధ్యయనం నుంచి సామాన్యులు అసామాన్య స్థాయికి ఎదిగారని అన్నారు. సభాధ్యక్షత వహించిన తిరుపతి పుస్తక ప్రదర్శన నిర్వాహకులు, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ పుస్తకాలు మనుషుల్లోని మనో మాలిన్యాన్ని తొలిగిస్తాయన్నారు. పుస్తకం మనిషి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నారు. అంతకు ముందు పుస్తక ప్రదర్శనను ఆయన తిలకించారు. సుమారు 70 పుస్తక ప్రచురణ, విక్రయ సంస్థలు తమ పుస్తకాలను ప్రదర్శనకు ఉంచాయి. పుస్తక ప్రదర్శన వేదికపై పాడిన అన్నమయ్య కీర్తనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

2,52,234మందికి పింఛన్ల పంపిణీ



శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉదయమే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. రాత్రి 7.30 గంటల వరకు 2,63,191మందికి గాను 2,53,217 మందికి రూ.107.13కోట్లు పంపిణీ చేశారు. జిల్లాకు మూడవ స్థానం దక్కింది. కాగా, సర్వర్ సమస్య తలెత్తడంతో సుమారు 3 గంటల పాటు అంతరాయం ఏర్పడింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

11న స్థానికులకు శ్రీవారి దర్శనం టీటీడీ

తిరుమల, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి స్థానికుల దర్శన కోటాలో అధికారులు మార్పు చేశారు. ఈనెల4న మొదటి మంగళవారం రోజు రథసప్తమి కారణంగా రెండవ మంగళవారం (11వ తేదీ) స్థానికులకు దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలోని స్థానికులకు బాలాజీనగర్ కమ్యూనిటీహాల్‌లో, తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 9వ తేదీ ఆదివారం టోకెన్లు జారీ చేయనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. ● గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.2.52 కోట్లు. ● శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 51,818. ● తలనీలాలు సమర్పించినవారు: 19,023.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం

- అందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం
- మహిళలకు పసుపు కుంకుమ
- మహాశివరాత్రి వేడుకలపై మంత్రుల సమీక్ష

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులను సంతృప్తికర దర్శనం కల్పించడమే లక్ష్యమని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై శనివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ వివరాలను మంత్రులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా నిర్వహిస్తామన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ఉత్సవాల్లో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. మహిళలకు జ్ఞానప్రసూనాంబిక అనుగ్రహ ప్రసాదంగా రవిక, గాజులు, పసుపు, కుంకుమను సారెగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వీవీఐపీ, వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించామన్నారు. పిల్లలు తప్పిపోతే సులభంగా గుర్తించేలా జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున పట్టువస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబును ఆహ్వానించామన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డు నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించేందుకు అనుమతించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ఈవో బాపిరెడ్డి, నాయకులు టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

స్థానికులకు ఉచిత దర్శనం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికులకు శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనాన్ని ఉచితంగా కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శివరాత్రి మరుసటి రోజున స్థానికుల కోసం ప్రత్యేకంగా ఉచిత క్యూలైన్ విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి 24 మంది సభ్యులతో సేవా సమితిని ఏర్పాటు చేస్తామన్నారు.

వేద వర్సిటీలో చిరుత..!

- ఏడీ బిల్డింగ్ సమీపంలో కుక్కను చంపిన వైనం
- భయాందోళనలో విద్యార్థులు, ఉద్యోగులు



కుక్కను చంపి తింటున్న చిరుత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర వేద యూనివర్సిటీలో చిరుత జాడ కన్పించింది. శుక్రవారం రాత్రి రామేశ్వరం భవన్ (ఏడీ బిల్డింగ్) ముందున్న ఓ కుక్కను చంపి తింటున్న చిరుతను ప్రత్యక్షంగా అక్కడి వారు చూశారు. ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రించారు. చిరుత సంచారం నేపథ్యంతో వేద వర్సిటీ విద్యార్థులను, ఉద్యోగులను అధికారులు అప్రమత్తం చేశారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో బయటికి రావొద్దని కోరారు. అయితే చిరుత సంచారం వేద వర్సిటీ, ఎస్వీయూ పరిసరాల్లో హడలెత్తిస్తూ ఉంది. చిరుతను బంధించి భయాందోళన తొలగించాలని యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతిఒక్కరూ ఏదో ఒక క్రీడలో నైపుణ్యాన్ని చాటాలన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, రాజేష్‌రెడ్డి, రాఘవయ్య, కొండారెడ్డి, సౌమ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి: పాశం

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని 13వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచడంతో పాటు ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి వద్దకు వెళ్లి అందజేయడం జరుగుతోందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలను నేరవేర్చేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా మంత్రి నారా లోకేశ్ వివిధ బహుళజాతి కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు అబ్దుల్‌రహీం, జహంగీర్, ముర్తుజా, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఓజిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం నెమళ్లపూడి, కరబల్లవోలు గ్రామాల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.21 కోట్లతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, నిరంజన్, కనుమూరు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలో 95.15 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్య తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను విజయవంతం చేయండి



సమావేశంలో ఎఫ్ఎఫ్ఈ నిర్వాహణ కమిటీ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాందీమంజిల్‌లో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించే స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను విజయంతం చేయాలని ఎఫ్ఎఫ్ఈ కమిటీ సభ్యులు అన్నారు. శనివారం షాందీ మంజిల్‌లో ఫ్రీడంఫైటర్స్ ఎక్స్‌పో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో స్వాతంత్రోద్యమం ఒక మహోజ్వల ఘట్టమన్నారు. చరిత్రకు అందని ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకుని, భారతీయుల పోరాట పటిమకు, త్యాగానికి గుర్తుగా దేశభక్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహీం, కాలేషా, నాశిన భాస్కర్‌గౌడ్, రవిరాఘవేంద్ర, కాలేషా నాజర్, జహంగీర్, యస్దాని, జమాలుల్లా, అన్వర్‌బాషా, సద్దాం హుస్సేన్, అల్లీహుస్సేన్, ఖాజాహుస్సేన్, షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ, సిబ్బంది

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలోని విద్యార్థినిలకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్ విక్రయించినా, వినియోగించిన కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. యువత బాగా చదువుకుని మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, గాయత్రి, శ్రీనివాస్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి వృద్ధుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాళమ్మగుడి సమీపంలో గోడ కూలి మీదపడడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన పాపయ్య(60) తాళమ్మగుడి సమీపంలో కూలి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ మునిరవిచంద్ర శనివారం తెలిపారు.

విద్యుత్‌శాఖ ఏఈగా పూర్ణిమ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రూరల్ విద్యుత్‌శాఖ ఏఈగా పూర్ణిమ శనివారం బాధ్యతలు చేపట్టారు. చంద్రగిరిలో సబ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఈమె పదోన్నతిపై సూళ్లూరుపేట ఏఈగా వచ్చారు. ఆమెను లైన్ ఇన్‌స్పెక్టర్లు సురేంద్ర బాబు, అయాజ్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గురుకులం భవనానికి మోక్షం ఎప్పుడో?



గురుకుల పాఠశాల తరగతులు నిర్వహిస్తున్న వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాల

బాలాయపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలానికి మంజూరు చేసిన బీసీ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో బాలాయపల్లి మండలానికి బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. జయంపు గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా అనువైన భవనం లేకపోవడంతో నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాలలో తరగతులను అదే ఏడాది జూన్‌లో ప్రారంభించారు. అలాగే గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారు. అయితే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో గురుకుల పాఠశాల మంజూరుకు కృషి చేసిన అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి గత ప్రభుత్వంలో సహకారం కొరవడడంతో జయంపులో గురుకుల పాఠశాల భవనం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో జయంపులో గురుకుల పాఠశాల ఏర్పాటుపై అనుమానాలు నెలకొన్నాయి. అయితే గత ఎన్నికల ప్రచారం సందర్భంగా జయంపులో గురుకుల పాఠశాల భవనం నిర్మిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇవ్వడంతో ఆశలు చిగురించాయి. ఈ మేరకు ఎమ్మెల్యే కురుగొండ్ల, అధికారులు స్పందించి జయంపులో గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్

రూ.2.97 లక్షల సొత్తు, రెండు ఆటోల స్వాధీనం ● ఆరుగురి రిమాండ్



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ సంగమేశ్వరరావు

పెళ్లకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేస్తున్న ముఠాలో నలుగురిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.97 లక్షల విలువైన రాగివైరు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. పెళ్లకూరు మండలం చెంబేడుకు చెందిన అనిల్, కిరణ్, రమణయ్య, నిరంజన్, అజయ్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన ఓంకార్, శామ్యూల్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు శ్రీకాళహస్తి పెళ్లకూరు, నాయుడుపేట, దొరవారిసత్రం, ఓజిలి మండలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగలుగొట్టి అందులో ఉన్న రాగి వైరును అపహరించుకుని వెళ్లేవారు. పెళ్లకూరు మండలం రోసనూరు, చెన్నప్పనాయుడుపేట గ్రామాలతో పాటు వివిధ మండలాల్లో 26 ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించినట్లు 11 కేసులు నమోదయ్యాయి. దీంతో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. సాంకేతికత ఆధారంగా అనిల్, కిరణ్, రమణయ్య, నిరంజన్‌తో పాటు వీరి నుంచి రాగి వైరు కొనుగోలు చేసే శ్రీకాళహస్తికి చెందిన బాబు, సత్యవేడుకు చెందిన తిరుమలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఆరుగురు నిందితులను నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇక చెంబేడుకు చెందిన అజయ్, శ్రీకాళహస్తికి చెందిన ఓంకార్, శామ్యూల్ పరారీలో ఉన్నారని, వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తమ బిడ్డలు దొంగతనాలకు పాల్పడలేదని, అన్యాయంగా అరెస్ట్ చేశారంటూ నిందితుల తల్లిదండ్రులు, బంధువులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు.

క్రిస్ సిటీ భూనిర్వాసితులకు అండగా ఉంటా: పాశం



రైతుల అభిప్రాయాలు వింటున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడంతో పాటు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో శనివారం కోట, చిల్లకూరు మండలాల భూ నిర్వాసితులతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. రైతుల అభ్యంతరాలను విన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్ సిటీ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతుల కుటుంబాలకు పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. కొంతమందికి మాత్రమే పరిహారం వచ్చిందని, మిగిలిన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. అంతకుముందు కోట పట్టణంలో స్వర్గీయ నల్లపరెడ్డి గోపాలరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోట పట్టణంలో రూ.2.67 కోట్లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేశారు. అల్లంపాడు పంచాయతీ పరిధిలోని చీకళ్లదిబ్బ వద్ద చిల్లకూరు రామసుబ్బారెడ్డి, సుశీలమ్మ దంపతుల జ్ఞాపకార్థం నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, తీగల సురేష్‌బాబు, భాస్కర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, కోటేశ్వరరెడ్డి, వాకా విజయభాస్కర్ రెడ్డి, దారా సురేష్, తదితరులు పాల్గొన్నారు.


5న ఓజిలి మండల సమావేశం

ఓజిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సమావేశం ఈనెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

చిట్టేడు మద్యం షాపులో చోరీ

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు వద్ద ఉన్న మద్యం షాపులో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు షాపు తాళాలు పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.1.68 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్, కోట ఎస్ఐ పవన్‌కుమార్ చోరీ జరిగిన మద్యం షాపును పరిశీలించారు.

బలరామిరెడ్డికి వైసీపీ నేతల నివాళి



బలరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి, సత్యనారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నాయకుడు తంబిరెడ్డి బలరామిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శనివారం నాయుడుపేటలో జరిగిన ఉత్తరక్రియల్లో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దనరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, రాహుల్, కౌన్సిలర్లు దారా రవి, పాలేటి నాగార్జున తదితరులు బలరామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

టీటీడీ సహకార పరపతి సంఘంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల సహకార పరపతి సంఘంలో జనరల్ మేనేజర్ పోస్టు భర్తీ కోసం (కాంట్రాక్ట్ విధానం) ఈ నెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆపై కేడర్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7780795330, 9959670942 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

స్థానిక అభివృద్ధి పనులకు ఇసుక ఇవ్వాలని నిరసన



స్వర్ణముఖినదిలో వాహనాలు రాకుండా హిటాచీని అడ్డంగా పెట్టిన రీచ్ ప్రతినిధులు

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి స్వర్ణముఖినది నుంచి స్థానిక అభివృద్ధి పనులకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలంటూ శనివారం స్థానికులు ఆందోళన చేపట్టారు. గూడలి పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించేందుకు రీచ్‌కు కేటాయించిన స్థలంలోకి స్థానికులు వెళ్లారు. అక్కడే ఉన్న రీచ్ ప్రతినిధులు దారికి అడ్డంగా హిటాచీ, ఎక్స్‌కవేటర్లను అడ్డంగా పెట్టడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ పవన్‌కుమార్ స్వర్ణముఖినది వద్దకు చేరుకొని స్థానికులతో చర్చించారు. ఇసుకను తరలించేందుకు అనుమతి ఇస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు వెళ్లిపోయారు.

గూడలిలో మాఘ మాస పూజలు

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని భూదేవి, శ్రీదేవి సమేత జనార్థనస్వామి ఆలయంలో శనివారం మాఘమాస పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో జనార్థనస్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గూడూరు అర్బన్, చిల్లకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కుందకూరు సమీపంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు అన్నదానం చేశారు. అలాగే చిల్లకూరు మండలం కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

సీఐఎస్ఎఫ్ సహాయ ఇన్‌స్పెక్టర్లకు సన్మానం



వెంకటరావు, వేణుగోపాలరావుతో కమాండెంట్ సంజీత్ కుమార్, డిప్యూటీ, అసిస్టెంట్ కమాండెంట్‌లు నీలేష్ గౌర్, లక్ష్మణ్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సీఐఎస్ఎఫ్ సహాయ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన గున్నం వెంకటరావు, పీతల వేణుగోపాల్ రావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. శనివారం షార్‌లోని సీఐఎస్ఎఫ్ బ్యారక్ హాలులో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజీత్ కుమార్ కమాండెంట్ ఆధ్వర్యంలో వెంకటరావు, వేణుగోపాలరావును ఘనంగా సన్మానించారు. 40 ఏళ్లపాటు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నీలేష్ గౌర్, అసిస్టెంట్ కమాండెంట్ సన్‌చిట్ లక్ష్మణ్, జేఏవో సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయ చైర్మన్ పదవికి తిరుమూరును ప్రతిపాదించాం: నెలవల

ఓజిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పదవికి టీడీపీ సీనియర్ నాయకుడు తిరుమూరు సుధాకర్‌రెడ్డి పేరును ప్రతిపాదించినట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శనివారం ప్రకటించారు. ఓజిలి మండలం నెమళ్లపూడి దళిత కాలనీలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేసిన అనంతరం జరిగిన సభలో నెలవల మాట్లాడుతూ ఎమ్మెల్యే, పార్టీ నేతలతో చర్చించి ఆయన పేరును అధిష్ఠానానికి పంపామన్నారు. సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార సాధనాలు నాయకుల మధ్య అపోహలు సృష్టించి పలు పేర్లను తెరమీదకు తెస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన చేస్తున్నట్లు వివరించారు.

పరిహారం ఇచ్చాకే భూములను తీసుకోండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకు భూములు తీసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదని, పరిహారం బ్యాంక్ ఖాతాల్లో వేశాకే భూముల్లోకి దిగనిస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు రైతులు తేల్చిచెప్పారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపుర అగ్రహారం గ్రామాల రైతులకు చెందిన భూములు సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు వెళ్లాయి. పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు అదే భూముల్లో వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో శనివారం నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గ్రామసభ నిర్వహించారు. భూములతో పాటు పంటలకు కూడా ఎకరానికి రూ.15వేల నుంచి రూ.30వేల వరకు పరిహారం ఇచ్చేందుకు రైతులను ఒప్పించారు. అయితే పరిహారం తమ బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తేనే భూముల్లోకి దిగనిస్తామని రైతులు తేల్చిచెప్పారు. రెవెన్యూ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. సమాచారం తెలుసుకున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చేరుకొని భూమి, పంట పరిహారం రెండూ కలిపి 15 రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని, ఈలోపు పనులు జరగనివ్వాలని కోరారు. ఇందుకు రైతులు అంగీకరించకపోవడంతో సబ్ కలెక్టర్ వెళ్లిపోయారు. అంతకుముందు కొంతమంది రైతులు పరిహారం కోసం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో ఉన్న ముగ్గురి అరెస్టు

తడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో శ్రీకాళహస్తి రోడ్డులో ముగ్గురు వ్యక్తులు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. వారిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద పదునైన పెద్ద కత్తిని ఉండడంతో పూర్తిస్థాయిలో విచారించగా చెన్నైకు చెందిన సతీష్‌కుమార్, హరీష్, నవీన్‌కుమార్‌గా తెలిసింది. చెన్నైలోని పలు పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారు తడలో తిరుగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ముగ్గురిని సూళ్లూరుపేట న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

కల్లుగీత కార్మికులకు మూడు మద్యం షాపులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో కల్లుగీత కార్మికులకు మూడు మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిందని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఒక్కో షాపు చొప్పున కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలను కేటాయించిందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో వ్యక్తి ఒక్క షాపునకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అధిక వేగంతోనే ప్రమాదాలు



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, వేదికపై సీఐ మురళీకృష్ణ, ఆర్డీవో అనిల్ కుమార్, కళాశాల ప్రినిపాల్ సురేష్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అధిక వేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. శనివారం స్థానిక గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే మద్యం తాగి వేగంగా వాహనాలు నడపడం వల్లేనని పలు సర్వేల్లో తేలిందన్నారు. ఇందులో ఎక్కువగా యువకులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకొంటే ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, రవణాశాఖ అధికారి అనిల్‌కుమార్, ఎస్ఐ బ్రహ్మనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ మొక్కల నరికివేత

ఓజిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మనవాలి గ్రామంలో రెండు ఎకరాల్లో జామాయిల్ మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. మనవాలి రెవెన్యూ పరిధిలోని రెండు ఎకరాల భూమి గుంటమడుగు భువనేశ్వరి అనే మహిళ అనుభవంలో ఉంది. ఇందులో ఆమె జామాయిల్ సాగు చేస్తోంది. ఈ భూమి విషయమై రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు తోటలను నరికి వేసినట్లు బాధితులు తెలిపారు.



నరికివేసిన జామాయిల్ మొక్కలు